ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
కరీంనగర్
fb.com/vaartha Digital
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-11-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 290 పేజీలు: 8+16 వెల: 6.50

బిఎస్- 6 వాహనదారులకు ఊరట

బంగ్లాదేశ్‌లో మళ్లీ చెలరేగిన హింసాకాండ 5

ప్రపంచ శాంతి, భద్రతకు కట్టుబడి ఉన్నాం
పరస్పర సవాకారంతో సవాళ్లను ఎదుర్కొందాం
ఐసిసి అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదు
శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తికి ప్రోత్సాహం
ఐక్యరాజ్యసమితి సంస్కరణల కోసం ఒత్తిడి తెద్దాం
జిన్‌పింగ్, డొనాల్డ్ ట్రంప్, పుతిన్ అంగీకారం
భారత్‌పై భౌగోళిక రాజకీయ ప్రభావాలపైనా చర్చ
సాయంత్రం 4.27 గం.ల నుంచి 5.57గ.ల వరకు
అగ్రదేశాల అధినేతల 90 నిమిషాల సమావేశం
మనం నిజంగా చరిత్ర సృష్టిస్తున్నాం: ట్రంప్
శాంతిని కాపాడటం ఉమ్మడి బాధ్యత: పుతిన్
అణ్వాయుధ రహిత ప్రపంచాన్ని సృష్టించాలి: జిన్‌పింగ్



అణుయుద్ధం నో

త్రైపాక్షిక భేటీలో నిర్ణయం

చైనా, అమెరికా, రష్యా శాంతి ప్రకటన

అణ్వాయుధాల వినియోగ ప్రమాదాన్ని తగ్గించడంపై చర్చించడానికి అమెరికా, రష్యా, చైనాలు ప్రత్యేకమైన స్థితిలో ఉన్నాయి. -ట్రంప్

ప్రపంచ శాంతిని ప్రోత్సహించడం అనే అంశంపై మనం చర్చలు జరుపుతాం. -జింపింగ్

అంతర్జాతీయ శాంతిని కాపాడటానికి మనందరికీ ఉమ్మడి బాధ్యత ఉంది. -పుతిన్

షెన్‌జెన్, నవంబరు 19: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, 2026 నవంబరు 19న షెన్‌జెన్‌లో జరిగిన తమ మొట్టమొదటి త్రైపాక్షి క శిఖరాగ్ర సమావేశం అనంతరం, గురువారం 'శాంతి దిశగా చైనా- రష్యా- అమెరికా దేశాధినేతల ప్రకటన్న పేరుతో ఒక సంయుక్త ప్రకటనను జారీచేశారు. వ్యూహాత్మక స్థిరత్వం, అంతర్జాతీయ భద్రతను కాపాడు కోవడం, ఐక్యరాజ్యసమితిని సంస్కరించడం, >>2

చైనా అందగత్తెలంతా గూఢచారులే: ట్రంప్ 7



2029లోనే కాదు.. సిద్దిపేట గడ్డమీదా

కాంగ్రెస్ జెండా



సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

గురువారం సిద్దిపేట బహిరంగ సభకు హాజరైన అశేష ప్రజానీకం

రేషన్‌కార్డు లేకపోయినా రూ. 5లక్షల బీమా: సిఎం

3 తరాల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ నూతన పథకాలను అమలు చేస్తున్నాం
తెలంగాణలో బిఆర్ఎస్‌కు భవిష్యత్ లేదు
నేను తెలంగాణ బిడ్డనే.. అన్యాయం చేయ
సిద్దిపేట సభలో సిఎం రేవంత్‌రెడ్డి
'ఇందిరమ్మ జీవిత బీమా' ప్రారంభించిన సిఎం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: సిద్దిపేట గడ్డమీదనే కాదు 2029లో రెండో సారి తెలంగాణ గడ్డపై ప్రజాపాలన కాంగ్రెస్ జెండా ఎగరవేసి ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమాన్ని నడిపిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నాగదేవత గుడిసమీపంలో గురువారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు నాలుగు దశాబ్దులుగా మూడు తరలుగా స్వర్గీయ ఎన్టీఆర్, స్వర్గీయ వైఎస్ఆర్, కెసిఆర్ అమలు చేసిన పథకాలను ఒక్కటి కూడా రద్దు చేయకుండా కొత్తగా సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యమే అధికారంలో ఉంటుందన్నారు. కెసిఆర్‌ను నమ్మితే నట్టేట ముంచుతారని రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల బాగోగులు కెసిఆర్ ఏనాడు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు ఆకలితోనైన చస్తారు కానీ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం కావాలో బానిస బతులకు కావాలో ఆలోచించుకోవాలన్నారు. అబద్దాలతో కెటిఆర్, హరీష్‌రావులు బయలు దేరారని మీ బైరుపుల ఏసలు ప్రజలు గమినిస్తున్నారని తెలిపారు. కెసిఆర్, కెటిఆర్,హరీష్‌రావులకు రాబోయే రోజుల్లో కర్రు కాల్చి వాతలు పెట్టడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని >>2



గురువారం హెచ్ఐసిసిలో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ. చిత్రంలో సిఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

దేశంలో రోడ్డు ప్రమాదాలు

కన్నీళ్లు తెప్పిస్తున్నాయి

జాతీయ రహదారుల నిర్మాణంలో రికార్డులు

ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశంలో కేంద్ర మంత్రి గడ్కరీ

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త: జాతీయ రహదారుల నిర్మాణంలో చాలా రికార్డులు సాదించామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. హైవేల నిర్మాణంలో ఇంజినీర్లు కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. గురువారం హెచ్ఐఐసిలో '85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' వార్షిక సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్గా ఉందని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల >>2

అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు లేదు.. 2

మంచి రహదారులు లేని దేశం అభివృద్ధి చెందదు: సిఎం రేవంత్



ఫిబ్రవరి 24 నుంచి

ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 24నుంచి నిర్వహించడానికి షెడ్యూల్‌తో కూడిన టైంటేబుల్‌ను ఇంటర్మీడియల్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 20వరకు జరిగే ఈ పరీక్షలు ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం 12గంటలవరకు మూడుగంటల నిడివితో పరీక్షలు జరగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటనలో పేర్కొంది. 24 మొదటి సంవత్సరం పరీక్ష 25 ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదలవుతాయి. ప్రయోగ పరీక్షలుఫిబ్రవరి 1నుంచి పది వరకు జరుగుతాయి. మొదటి సంవత్సరం వారికి కొత్త విధానం ప్రకారం ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు మూడు సెషన్స్‌లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని ప్రకటనలో >>2

అనుమతులు లేకుండా ప్రాజెక్టుల

నిర్మాణాలు చేపట్టవద్దు

తెలుగు రాష్ట్రాలకు కెఆర్ఎంబి సూచన



హైదరాబాద్,నవంబరు 19,ప్రభాతవార్త: కృష్ణా నది వివాదాల ట్రిబ్యునల్ తీర్పు వెలువడే వరకు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలు అనుమతులు లేకుండా ఏలాంటి కొత్త ప్రాజెక్టులు చేపట్టవద్దని కెఆర్ఎంబి గురువారం ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖ సెక్రటరీలకు ఆదేశాలు జారీచేశారు. తెలంగాణ ప్రభుత్వం 666/2024 కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖను సుప్రీంకోర్టులో చాలెంజ్ చేసిన రిట్‌పిటిషన్ ఉదహరిస్తూ తేది 16.112026తెలంగాణ నీటిపారుదల సెక్రటరీ రాసిన లేఖకు ప్రత్యుత్తరం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాగార్జున సాగర్ రిజర్వాయరు విజయపురి సౌత్ వద్ద చేపట్టి 'అమర జీవి జలధార' పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. 2014 పునర్విభజన చట్టం కింద అనుమతులు, క్లియరెన్సు వచ్చే వరకు ప్రాజెక్టు పనులు చేపట్టకుండా, నీటిని తోడకుండా నిరోధించాలని కోరింది. ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వ జల్‌శక్తి మంత్రిత్వశాఖ కార్యద ర్శికి, కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి లేఖ రాసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ఈ తరహా ప్రాజెక్టులు తెలంగాణ నీటి ప్రయోజనా లకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాగార్జున సాగర్ ముంపు ప్రాంతమైన విజయపురి సౌత్ వైపు రూ.1200 కోట్లతో రోజుకు 160 మిలియన్ లీటర్ల అంటే ఏడాదికి 1.865 టిఎంసి నీటిని తీసుకునేలా పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును చేపట్టింది. జలజీవన్ మిషన్ కింద చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పల్నాడు జిల్లాకు తాగునీటిని సరఫరా చేయనుంది. ఈ ప్రాజెక్టు ఇన్టేక్‌వెల్,వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైపు లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.95 కోట్లు ఖర్చు చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని నాగార్జునసాగర్ నుంచి 150.45 మీటర్లు, 160 మీటర్లు, 170 మీటర్ల నీటిమట్టంవద్ద తీసుకోవాలని ప్రతిపాదించింది.అయితే ఇప్పటివరకు నాగార్జున సాగర్‌లో అతి తక్కువ ప్రతిపాదిత >>2



గురువారం హైదరాబాద్‌లో టీ షర్ట్‌లను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సినీనటుడు నాగార్జున 2

డ్రగ్స్ మహమ్మారిపై సమరం

నషా ముక్త్ భారత్ యాత్రకు నటుడు నాగార్జున మద్దతు



గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కెటిఆర్ 2

రేవంత్ రెన్యువల్ సిఎం

కెటిఆర్ ఆరోపణ... బిఆర్ఎస్‌లో పలువురు చేరిక



'ఇండియా ఫస్ట్'

ఈ మంత్రం పాటించాలి

వ్యవసాయ రంగంలో పెట్టుబడులు.. భారత్ 2047లక్ష్యంగా ఆర్థికాభివృద్ధి
దేశీ వస్తువుల వినియోగం పెరగాలి.. స్వయం సమృద్ధి సాధించాలి
ఫిక్కీ వార్షిక సమావేశంలో ప్రధాని మోడీ పిలుపు 3

జిటిఎ5 నుంచి జిటిఎ6 వరకూ అద్వితీయ ప్రగతి
దేశంలో అనూహ్య మార్పులు : గేమింగ్ వీడియోను పోలుస్తూ ప్రధాని మోడీ ట్వీట్ 5



'అక్వాన్' తుపాను నేపథ్యంలో ఒడిశాలోని పూరీలో సముద్ర తీరానికి సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతం నుండి ఒక వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పోలీసులు

అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు లేదు..

మంచి రవాదారులు లేని దేశం అభివృద్ధి చెందదు: సిఎం రేవంత్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు19: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. నిర్దేశించిన లక్ష్యాక్షల సాధనలో దేశం ప్రగతి సాధించడానికి తనవంతు కర్తవ్యంగా తెలంగాణ కూడా తోడ్పాటును అందిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో గురువారం ప్రారంభమైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సదస్సుకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 మన దేశానికి ఎంతో ప్రాధాన్యం ఉన్న సంవత్సరం.. మనం స్వాతంత్ర్యం సాధించి నాటికి వందేళ్లు అవుతుంది. జాతీయ ప్రయోజనాలు, దేశ భద్రత, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం విషయంలో రాజకీయాలకు తావులేదు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, మిగిలిన సమయంలో దేశాభివృద్ధిపైనే దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ తన వంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యానికి తగినట్లు ..తెలంగాణ రైజింగ్.. విజన్‌తో ముందుకు సాగుతున్నామని, 2034 నాటికే 1 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ, జాతీయ జీడీపీలో 5 శాతం వాటా అందిస్తోందని, 2047 నాటికి దానిని 10 శాతానికి పెంచుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అందించిన ప్రతిపాదనలకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సీఎం కోరారు,సంపన్న దేశాలు గొప్ప రహదారులను నిర్మించవని, గొప్ప రహదారులే దేశాలను ధనిక, అభివృద్ధి చెందిన దేశాలుగా మారుస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) తమ విజన్‌కు నిదర్శనాలని చెప్పారు. ఆర్థిక ప్రగతి కోసం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించామని, అందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 2,100 చదరపు కిలోమీటర్ల హైదరాబాద్ నగరాన్ని క్యూర్ (దిగీళిని)గా గుర్తించామని, అందులో సేవల రంగానికి (సర్వీసెస్) ప్రాధాన్యమిస్తామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్యూర్ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కారిడార్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ..చైనా ప్లస్ వన్.. అనే వ్యూహానికి ఇది తాము చూపే జాతీయ పరిష్కారమని తెలిపారు. ఆర్ఆర్ఆర్ వెలుపలి నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న రేర్ ప్రాంతాన్ని వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమల కోసం అభివృద్ధి చేస్తామని వివరించారు.మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారులనే కాక ఇతర పనులను తమ రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ చేపడుతోందని సీఎం వెల్లడించారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం, నిమ్స్ విస్తరణ, టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా మొత్తం 8 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ..భారత్ ఫ్యూచర్ సిటీ..లో ఆసియాలోనే అతిపెద్ద ఎక్స్‌పోగా ..ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026.. నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ సదస్సుకు పరిశ్రమల ప్రతినిధులు, నిపుణులు తరలిరావాలని సీఎం ఆహ్వానించారు. ఈ సదస్సులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.ఐఆర్‌సి అధ్యక్షుడు లక్ష్మీకాంత పది, ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

రేవంత్ రెన్యువల్ సిఎం

కెటిఆర్ ఆరోపణ.. బిఆర్ఎస్‌లో పలువురు చేరిక

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త: బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రజల ఆకాంక్ష అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం భూపాలపల్లి నియోజకవర్గం నుంచి కేటీఆర్ సమక్షంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ మాటలే నిజమవుతున్నాయన్నారు. ఓట్ల కోసం తామెప్పుడూ అబద్ధాలు చెప్పలేదన్నారు. కాంగ్రెస్‌ను వాళ్ల ఎమ్మెల్యేలే తిడుతున్నారని.. అవినీతి ప్రభుత్వమని వాళ్లే చెప్తున్నారని తెలిపారు. తెలంగాణ వచ్చినప్పుడు ఐదు మెడికల్ కాలేజీలు ఉండేవని.. కేసీఆర్ హయాంలో 32 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యాక్టింగ్‌లో కమలహాసన్‌ను మించిపోయారంటూ మాజీ మంత్రి ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తానంటూ భట్టి విక్రమార్క అఫిడవిట్‌తో హనుమాన్ గుడిలో ప్రమాణం చేశారన్నారు. క్రెడిట్ కార్డు లాంటిది భద్రంగా పెట్టుకోవాలని.. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నారని గుర్తు చేశారు. మూడేళ్లు గడిచినా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని..ఇఎంఐ సిఎం అని, ఆయన ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు ఇఎంఐ కడితేనే ఆయన సిఎం పదవి రెన్యూవల్ అవుతదని, ఆయన రెన్యువల్ సీఎం అంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పార్టీకి కాంగ్రెస్, బీజేపీ బానిసలంటూ దుయ్యబట్టారు.మేడిగడ్డను కాంగ్రెస్ వాళ్లే బాంబులతో పేల్చేశారని కేటీఆర్ ఆరోపించారు. పోలీసులకు ఇంజినీర్లు ఫిర్యాదు కూడా చేశారన్నారు. మూడేళ్ల నుంచి రెండు పిల్లర్లు రిపేర్ చేయలేకపోతున్నారని మండిపడ్డారు. వరద వచ్చి మొత్తం మేడిగడ్డ కొట్టుకుపోవాలని కుట్ర చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. రూ.400 కోట్లతో పూర్తయ్యే మేడిగడ్డ రిపేర్ల కోసం.. రూ.4 వేల కోట్లు ఖర్చు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. మూడేళ్లలో 4.70 లక్షల పెన్షన్లు తొలగించారన్నారు. ఇప్పుడు కొత్తగా 4.65 లక్షల పెన్షన్లు ఇస్తున్నారని.. కొత్త పెన్షన్లపై కాంగ్రెస్‌వి డ్రామాలు అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ మహమ్మారిపై సమరం

నషా ముక్త్ భారత్ యాత్రకు నటుడు నాగార్జున మద్దతు

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త: సమాజాన్ని, ముఖ్యంగా యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ రక్కసిని అంతమొందించేందుకు సమరం చేయాలని టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ యాత్ర నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డితో గురువారం నాగార్జున భేటీ అయ్యారు. ఈ యాత్రకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్‌ను అంతమొందించడం మనందరి సామాజిక బాధ్యతన్నారు. ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం జరిగే ఇలాంటి కార్యక్రమాలకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. యువత బంగారు భవిష్యత్తును చిదిమేస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్" పిలుపు మేరకు, 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మించాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృఢ సంకల్పంతో ఈ యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. భావితరాల భద్రత కోసం నిర్వహిస్తున్న ఈ మహా యజ్ఞంలో యువత, తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు

>> పేర్కొంది. ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్షలు ఫస్టియర్ విద్యార్థులకు జనవరి29న, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు జనవరి30న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9నుంచి 12వరకు మొదటి సెషన్ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదువరకు రెండో సెషన్ ఆదివారం కూడా పరీక్షలు ఉంటాయని అబిలాష అభినవ్ తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులకు ఇదే కాలక్రమ పట్టికను అనుసరించాల్సి ఉంటుందని తెలిపారు వార్షిక పరీక్ష టైంటేబుల్ మాత్రం వేరే విధంగా ఉంటుందని ఇది పూర్తిగా తాత్కాలిక షెడ్యూల్‌గా ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

వారం - వర్జ్యం

20-11-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, అనురాధ కార్తె,

తి.దశమి ఉ.7.14, న.పూర్వాభాద్ర ఉ.6.55
వ.సా.4.29 - సా.6.05,
దు.ఉ.8.29-ఉ.9.14, 2.మ.12.15-మ.1.00,
రాహు ఉ.10.30-ఉ.12.00,
శుభ స. ఉ.5.00-ఉ.6.00

వార్తాఫలం

మేషం : మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

వృషభం : బంధువులతో వివాదాలు చికాకులు పెడతాయి. దీర్ఘకాలిక సమస్యలు మరోవైపు వేదిస్తాయి. మన:శాంతి కరువు అవుతుంది.

మిథునం : ఆస్తి తగాదాలు పరిష్కారం దశకు చేరుకుంటాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు.

కర్కాటకం : ఈరోజు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఆరోగ్యం జాగ్రత్త.

సింహం : పనులలో తొందరపాటు వద్దు. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది.

కన్య : సహోదరీ వర్గానికి సహాయ సహకారాలు అందించవలసి వస్తుంది. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది.

తుల : అవకాశాలు అనుకూలంగా ఉన్న నిశ్చార ణమైన చికాకులు కొంత అశాంతికి గురి చేస్తాయి.

వృశ్చికం : పరిశ్రమలలో అవరోధాలు ఏర్పడి చికాకులు కలిగిస్తారు. ఆప్తుల సలహాతో ముందుకు సాగుతారు.

ధనుస్సు : ఆస్తి తగాదాలు ఏర్పడతాయి. క్రయ విక్రయాలలో తొందరపాటు వద్దు. పెట్టుబడులలో నిదానం అవసరం.

మకరం : రాజకీయ రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగాలలో ఆకస్మికమైన మార్పులు ఉంటాయి.

కుంభం : సంఘంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది. అరుదైన అవకాశం వెతుక్కుంటూ రాగలదు. కాంట్రాక్టులు లభిస్తాయి.

మీనం : దీర్ఘకాలిక సమస్యలు ఎదురైవుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

అణుయుద్ధం నో

>> ఇంధన సహకారాన్ని బలో పేతం చేయడం, అణు ప్రమాదాలను తగ్గించడం వంటి విషయాలలో ఈ మూడు దేశాల నిబద్ధతలను ఈ ప్రకటన వివరించింది. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితిపై ఈ ముగ్గురు నాయకులు లోతైన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ప్రకటనలో చారిత్రాత్మక త్రైపాక్షి క శిఖరాగ్ర సమావేశంగా అభివర్ణించబడిన దానికి ఆతిథ్యం ఇచ్చినందుకు పుతిన్, ట్రంప్ చైనాను అభినందించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలుగా, ప్రపంచ సవాళ్లకు మరింత సమర్థవంతంగా స్పందించడానికి, అంతర్జాతీయ శాంతి, భద్రతలను కాపాడాలనే తన ప్రాథమిక కర్తవ్యాన్ని మరింత మెరుగ్గా నెరవేర్చడానికి ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తీసుకురావడానికి చైనా, రష్యా, అమెరికా కట్టుబడి ఉన్నాయి. ఇంధన సహకారంపై, అన్ని దేశాల ప్రయోజనం కోసం శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి, సరఫరాను పెంచాలని తాము యోచిస్తున్నట్లు ఆ మూడు దేశాలు తెలిపాయి. స్థిరమైన ఇంధన ప్రవాహాలను కొనసాగించడం ప్రాముఖ్యతను కూడా వారు పునరుద్ఘాటించారు. ఈ ప్రకటన అంతర్జాతీయ న్యాయ సంస్థల అధికార పరిధిని కూడా ప్రస్తావించింది. ప్రభుత్వ సమ్మతి సూత్రం, ప్రభుత్వ అధికారుల రక్షణ హక్కులను గౌరవించడం ప్రాముఖ్యతను ఆ ముగ్గురు నాయకులు గుర్తించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు, ఇతర సారూప్య సంస్థలు తమ అధికార పరిధిని దుర్వినియోగం చేయకూడదని వారు అంగీకరించారు. అణు భద్రతపై, అణు యుద్ధంలో గెలవలేమని, దానిని ఎన్నడూ చేయకూడదని షీ, పుతిన్, ట్రంప్ పునరుద్ఘాటించారు. అణు ప్రమాదాలను తగ్గించడం, అణ్వాయుధాల వ్యాప్తిని నిరోధించడంపై చర్చలు జరపడానికి వారు కట్టుబడి ఉన్నారు. ట్రంప్, షీ, పుతిన్‌ల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశం తరువాత ఈ ప్రకటన వెలువడింది. ఈ సమావేశం అంతర్జాతీయ సంబంధాలలో ఒక మలుపుగా నిలవవచ్చు లేదా కేవలం ఒక ప్రతీకాత్మక దౌత్య కార్యక్రమంగా మిగిలిపోవచ్చు. వాషింగ్టన్‌కు ప్రధాన ప్రత్యర్థులైన షీ, పుతిన్‌లతో జరిగిన మొట్టమొదటి త్రైపాక్షి క సమావేశాన్ని, అణ్వాయుధాలను నియంత్రించే నిబంధనలపై చర్చించడానికి, ఉక్రెయిన్, ఇరాన్‌లలో యుద్ధాలను పరిష్కరించే మార్గాలను అన్వేషించడానికి ఒక అవకాశంగా ట్రంప్ ప్రచారం చేశారు. అయితే, నిపుణులు పెద్ద పురోగతులపై అంచనాలను తక్కువగానే ఉంచారు. ఈ సమావేశంలో, విభిన్న జాతీయ ప్రయోజనాల నేపథ్యంలో ఈ ఒప్పందం ఆచరణాత్మక ఫలితాలు, ప్రపంచ స్థిరత్వం, భారతదేశంపై దాని భౌగోళిక రాజకీయ ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అధికారపర్గాల సమాచారం ప్రకారం, షీ, ట్రంప్, పుతిన్‌ల మధ్యచారిత్రాత్మక షెన్‌జెన్ చర్చలుస్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.27గంటలకు ప్రారంభమై,90 నిమిషాలపాటుజరిగి సాయంత్రం5.57గంటలకు ముగిశాయి.

చరిత్ర సృష్టిస్తున్నాం: ట్రంప్

"మనం నిజంగా చరిత్ర సృష్టిస్తున్నాం అని ట్రంప్ అన్నారు. ప్రపంచంలో అణ్వాయుధాల సంఖ్యను తగ్గించడం, వాటి వినియోగ ప్రమాదాన్ని తగ్గించడంపై చర్చించడానికి అమెరికా, రష్యా, చైనాలు ప్రత్యేకమైన స్థితిలో ఉన్నాయని ఆయన అన్నారు. త్రైపాక్షి క సమావేశం ప్రారంభంలో షీ కూడా శాంతి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. "ప్రపంచ శాంతిని ప్రోత్సహించడం అనే అంశంపై మనం చర్చలు జరుపుతాం అని ఆయన అన్నారు. అణ్వాయుధాలను నిషేధించి, నాశనం చేయాలని షీ తన సహచరులతో చెప్పినట్లు చైనా ప్రభుత్వ ప్రసార సంస్థ సిసిటివి నివేదించింది. అణ్వాయుధ రహిత ప్రపంచాన్ని సృష్టించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, రెండవ ప్రపంచ యుద్ధంలో విజేతలుగా నిలిచిన తమ మూడు దేశాల ఉమ్మడి చరిత్రను పుతిన్ ప్రస్తావిస్తూ, ప్రపంచ భద్రత పట్ల వారి బాధ్యతను నొక్కి చెప్పారు. "అంతర్జాతీయ శాంతిని కాపాడటానికి మనందరికీ ఉమ్మడి బాధ్యత ఉంది అని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు.

సిద్దిపేట గడ్డమీదా కాంగ్రెస్ జెండా

>> తెలిపారు. తెలంగాణలో బిఆర్ఎస్‌కు భవిష్యత్ లేదన్నారు. కాళేశ్వరం మూడు యేండ్లకే కూలేశ్వరం అయిందన్నారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన లక్ష్మణ్‌గౌడ్ వంటి ఉద్యమకారులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటే కల్వకుంట కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రజలు ఆలోచించాలన్నారు. గత పాలకుల హయాంలో రూ.20 లక్షల కోట్ల పన్నుల ఆదాయం, రూ.8 లక్షల కోట్ల అప్పులు కలిపి మొత్తం రూ.28 లక్షల కోట్ల నిధులు ఏమయ్యాయో ప్రజలకు లెక్కలు చెప్పాలన్నారు. కృష్ణ జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసింది గత పాలకులేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ నీటిని వదులుతున్నానని కొందరు అబద్దపు ప్రచారం చేస్తున్నారని తాను తెలంగాణ బిడ్డనని...తెలంగాణకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం చేయనని సిఎం స్పష్టం చేశారు. 2015లో ఉమాభారతి సమక్షంలో తెలంగాణకు 299 టీఎంసీల కృష్ణా జలాలు సరిపోతాయని పేర్కొని దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు తీరని అన్యాయం చేసినవారు కెసిఆర్, హరీష్‌రావులేనని తెలిపారు. ప్రగతి భవన్‌కు జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించుకోవాలని చెప్పింది కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. 2009లో పాలమూరు ఎంపిగా గెలిచిన కెసిఆర్ 10 యేండ్లు అధికారంలో ఉండి జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. గోదావరి నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించేందుకు స్వర్గీయ వైఎస్ఆర్ పనులు చేపట్టగా తుమ్మిడిహెట్టిని మేడిగడ్డకు మార్చి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. గత పాలకులు పంచభూతాలను సైతం దోపిడి చేశారని తెలిపారు. బతుకమ్మ చీరల పంపిణీలో సైతం దోచుకుతిన్నారని తెలిపారు. కోటి మంది మహిళలకు నాణ్యతో కూడిన కోటీ చీరలను పంపిణీ చేశామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 16 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు గుడిసెలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 75 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయరంగంపై రూ.1.87.000 కోట్లు ఖర్చు చేశామన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను ఆదుకుంటామని వివరాలను సేకరించడానికి అధికారులను పంపించి అందరికీ నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్,వివేక్‌వెంకటస్వామి, సీతక్క తదితరులు మాట్లాడారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఎంపిలు తదితరులు పాల్గొన్నారు.కాగా సిఎం సభలో దుబ్బాక మండలం చౌదరుపల్లిలో 294 ఎకరాల దళితుల భూమిని ఎంపి రఘునందన్‌రావు కబ్జా చేశారని ఆరోపిస్తూ సిఎం సభలో బాధితులు ప్లకార్డులు ప్రదర్శించారు. కాగా వచ్చే ఎన్నికల నాటికి మాజీ మంత్రి హరీష్‌రావు బిఆర్ఎస్‌లో ఉండరని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హరీష్‌రావు బిజెపితో అంటకట్టుకుని తిరుగుతున్నారని చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని తెలిపారు. హరీష్‌రావు బిజెపితో చీకటి ఒప్పందాలు చేసుకుంటలేనని సిద్దిపేట ఎల్లమ్మ సాక్షిగా ప్రమాణం చేసి చెప్పాలని డిమాండ్ చేశారు.



గురువారం సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్

కన్నీళ్లు తెప్పిస్తున్నాయి

>> నిర్మాణంలో నాణ్యత. పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. దేశంలో రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ మాటలు చెప్పడం కొంచెం ఇబ్బందిగా ఉన్నా చెప్పక తప్పని పరిస్థితి, ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారు,వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు' అని పేర్కొన్నారు. ఇకపై రోడ్లపై బ్లాక్ స్పాట్స్ కనిపించకూడదు, బ్లాక్ స్పాట్ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లదే' అని గడ్కరీ అన్నారు. ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి టెక్నాలజీ ఎంతో అవసరమని తెలిపారు. టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోని విజయవంతమైన మోడల్స్ అధ్యయనం చేయాల్సి ఉందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. రహదారుల నిర్మాణంలో భాగస్వాములైన ఇంజినీర్లు, అధికారులు, సాంకేతిక నిపుణులు, కార్మికులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని గడ్కరీ పేర్కొన్నారు. మెరుగైన రోడ్లతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పర్యావరణహిత రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. రహదారుల రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు నిపుణులు కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిష్కారాలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. అయితే పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత విషయంలో మనం ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. రోడ్లపై ఎలాంటి బ్లాక్ స్పాట్లు ఏర్పడకుండా ఉండేందుకు ప్రతి ఇంజినీర్ పూర్తి బాధ్యత తీసుకుని పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి డా. కె. ఇళంబరిథి, రాహుల్ గుప్తా(ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి)తో పాటు పలువురు ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు, రహదారి మౌలిక సదుపాయాల రంగ నిపుణులు, ఇంజినీర్లు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు దేశవ్యాప్తంగా పాల్గొన్నారు. భారతదేశ రహదారులు, జాతీయ రహదారుల మౌలిక సదుపాయాల భవిష్యత్తుపై చర్చించేందుకు ఈ వేదిక అవకాశం కల్పించింది.ఈ కార్యక్రమం సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడానికి, రహదారి ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న ఆధునిక అభివృద్ధిపై చర్చించడానికి, దేశ రవాణా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే వినూత్న విధానాలను అన్వేషించడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఈనెల 22వ తేదీ వరకు జరుగున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాలలో మొత్తం 19 సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల ద్వారా పరిశోధనలు, అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంతో పాటుసాంకేతిక అభివృద్ధి, నిర్మాణపద్ధతులు, నాణ్యతా ప్రమాణాలు, రహదారి భద్రత, సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు రహదారి రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అన్వేషించేందుకు, తమ అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ సమావేశం దోహదపడనుంది.తెలంగాణ రైజింగ్ లక్ష్యం దిశగా రాష్ట్రం ముందుకు సాగుతున్న తరుణంలో, రహదారి అనుసంధానాన్ని బలోపేతం చేయడం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడాన

‘ఇండియా ఫస్ట్’ మంత్రం పాటించాలి

- వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచాలి - ఔషధ తయారీ రంగంలో దిగుమతులు తగ్గించాలి - భారత్ 2047లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి - 50 కోట్లమందికి పేదరికం నుంచి విముక్తి - రాహుల్ వ్యాఖ్యలకు ప్రధాని మోడీ కౌంటర్



న్యూఢిల్లీ,నవంబరు 19: ‘ఇండియా ఫస్ట్ మంత్రం పాటించాలి: వచ్చే 20 ఏళ్లలో పారిశ్రామికవేత్తలు తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయానికి ‘ఇండియా ఫస్ట్ అనేదే పునాది కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. దీనివల్ల దేశం ఆత్మనిర్భర్‌గా మారడమే కాకుండా, వ్యాపార వృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయన్నారు. వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఫిక్కీని అభినందించిన ప్రధాని.. మారుతున్న కాలానికి అనుగుణంగా దేశ ఆర్థిక ప్రయాణంలో ఫిక్కీ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. 21వ శతాబ్దంలో ‘ఫ్రాజైల్ ఫైవ్ (బలహీన ఆర్థిక వ్యవస్థలు) జాబితాలో ఉన్న భారత్.. గత 12 యేళ్లలో యువత, రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తల కృషితో నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా (సుమారు 7 శాతం వృద్ధి రేటుతో) అవతరించిందన్నారు. గత నెలలో భారత వస్తువుల ఎగుమతులు దాదాపు 50 బిలియన్ డాలర్లకు చేరుకుని ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయని తెలిపారు. భారతదేశం ఆర్థిక విపత్తు దిశగా పయనిస్తోందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గట్టి కౌంటర్ ఇచ్చారు. గత 12 -13 ఏళ్లలో ఏకంగా 50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని, ఇది దేశ ఆర్థిక ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక వృద్ధి, ఎగుమతులు, పేదరిక నిర్మూలనలో సాధించిన పురోగతిని వివరించారు. భారత్ సాధిస్తున్న ఆర్థిక ప్రగతిని అంతర్జాతీయ సంస్థలు కూడా గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు. మూడీస్, ఎస్‌అండ్‌పీ, ఫిచ్, ప్రపంచ బ్యాంకు, ఆసియాదేశంలో పేదరికం తగ్గుదలపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. 1970వ దశకంలో కాంగ్రెస్ పార్టీ ‘గరీబీ హఠావో (పేదరికాన్ని నిర్మూలిద్దాం) అనే నినాదాన్ని ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో భారత జనాభా కూడా దాదాపు 50 కోట్లేనని అన్నారు. ఆ సమయంలోనే పేదరికాన్ని నిర్మూలించే అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వ విధానాల్లో లోపాలు, సరైన సంకల్పం లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. సరైన విధానాలు, దృఢమైన సంకల్పంతో పనిచేస్తే పేదరికాన్ని తగ్గించడం సాధ్యమని తమ ప్రభుత్వం నిరూపించిందని మోడీ పేర్కొన్నారు. భారతదేశం గతంలో లైసెన్స్ కోటా రాజ్ వంటి ఆర్థిక విధానాల కారణంగా అనేక సమస్యలను ఎదుర్కొందని ప్రధాని గుర్తుచేశారు. ఒకప్పుడు ప్రపంచంలోని బలహీన ఆర్థిక వ్యవస్థలుగా పరిగణించిన ఫ్రాగైల్ ఫైవ్ దేశాల జాబితాలో భారత్ కూడా ఉండేదని తెలిపారు. అయితే గత 12 ఏళ్లలో యువత, రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలు చేసిన కృషితో దేశ ఆర్థిక పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చిందని అన్నారు. రాయితీలు తీసుకుంటున్నారు.. మీ ఉద్యోగులకు జీతాలు పెంచారా?: కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు ఇచ్చాం.. మరి ఉద్యోగాలేవి? జీతాల పెంపు ఏది? అంటూ ప్రధాని నరేంద్ర మోడీ భారతీయ పారిశ్రామిక దిగ్గజాలను సూటిగా ప్రశ్నించారు.కార్పొరేట్ పన్ను రేటును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించామని, కొత్త పన్ను విధానంలో వ్యక్తిగత ఆదాయపు పన్నును రూ.12 లక్షల వరకు పూర్తిగా మినహాయించామని తెలిపారు. ‘మీరు ఎప్పుడూ మరిన్ని రాయితీలు కావాలని అడుగుతూనే ఉంటారు. కానీ, అందుకు తగ్గట్టుగా మీరు ఎక్కువ మంది ఉద్యోగులను నియమించుకున్నారా? మీ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను పెంచారా? అంటూ ప్రధాని నిలదీశారు.

పన్ను రిటర్నులు, రీఫండ్‌లను సులభతరం చేశామని, గతంలో 8 నెలలు పట్టే రీఫండ్‌లు ఇప్పుడు వారం రోజుల్లోనే వస్తున్నాయని పేర్కొన్నారు.

రీజినల్ రింగ్‌రోడ్, విజయవాడ హైవేకు కేబినెట్ ఆమోదానికి కేంద్ర మంత్రి గడ్కరి చొరవ చూపాలి: మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్,నవంబరు 19,ప్రభాతవార్త: రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి,కొత్త పరిశ్రమలు, వ్యాపారాలు, పెట్టుబడులు రావడానికి మంచి అవకాశాలు ఏర్పడతాయనీ కేంద్రక్యాబినెట్ ఆమోదంకు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి చొరవ చూపాలని తెలంగాణ రాష్ట్ర ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వేడుకొన్నారు.85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం మాట్లాడుతూ 1934లో ప్రారంభమైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్, అప్పటి నుంచి దేశంలో రోడ్లు, వంతెనల అభివృద్ధిలో ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తోందనీ చరిత్రను వివరించారు. దేశవ్యాప్తంగా రోడ్లు, వంతెనలు నాణ్యతతో నిర్మించడానికి, వాటి భద్రతను పెంచడానికి అవసరమైన ప్రమాణాలు, కొత్త పద్ధతులు, మార్గదర్శకాలను ఈ సంస్థ అందిస్తోందనీ ప్రశంసించారు. ఈసారి సమావేశంలో కూడా రోడ్ల రంగంలో వస్తున్న అనేక కొత్త మార్పులు, టెక్నాలజీల గురించి చర్చించబోతున్నాం. ముఖ్యంగా పర్యావరణానికి అనుకూలమైన రోడ్ల నిర్మాణం, వాతావరణ మార్పులను తట్టుకునేలా మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, వివిధ రవాణా మార్గాల అనుసంధానం, హైవేల నిర్మాణంలో వస్తున్న కొత్త పద్ధతులపై చర్చలు జరగనున్నాయి.ఇందులో నాకు ప్రత్యేకంగా ప్రస్తావించాలనిపిస్తున్న అంశం ఏమిటంటే ప్రతి ఒక్కరికీ సురక్షితంగా నడిచే హక్కు ఇవ్వాలని కోరారు.మనం పెద్ద పెద్ద హైవేలు, ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తున్నాం. అదే సమయంలో రోడ్డుపై నడిచే సామాన్యుడి భద్రతను కూడా అంతే ముఖ్యంగా చూడాలనీ అన్నారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడిచేలా ఫుట్‌పాత్‌లు, నడక మార్గాలు ఉండాలనీ కోరారు. రోడ్లు దాటడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.అభివృద్ధి అంటే కేవలం పెద్ద పెద్ద రోడ్లు నిర్మించడం మాత్రమే కాదు. ఆ రోడ్లపై ప్రతి ఒక్కరూ సురక్షితంగా నడిచేలా, ప్రయాణించేలా చూడటం కూడా మన బాధ్యతఅని అన్నారు.ఈ అంశంపై జరిగే చర్చల ద్వారా రవాణా వ్యవస్థను మరింత సురక్షితంగా, అందరికీ ఉపయోగపడేలా చేయడానికి మంచి సూచనలు వస్తాయని ఆశిస్తున్నాను.హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులో ఉత్తర భాగం పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. నితిన్ గడ్కారి దృష్టికి హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతులు మంజూరు చేయడం.రాష్ట్రంలోని 2,144 కిలోమీటర్ల మేర ఉన్న 23 రోడ్లను జాతీయ రహదారుల స్థాయికి పెంచడం.నల్గొండ జిల్లాలో ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 67 ఎకరాల భూమిలో అంతర్జాతీయ స్థాయి రవాణా, రోడ్ల నిర్మాణ శిక్షణ సంస్థను ఏర్పాటు చేయడం.జాతీయ రహదారుల వెంట ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ట్రక్ టెర్మినల్స్ ఏర్పాటు చేయడం.ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు 6 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం.511.68 కిలోమీటర్ల మేర రూ.1,227.75 కోట్ల సిఆర్‌ఐఎఫ్ రోడ్డు పనులకు అనుమతులు మంజూరు చేయడం.పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం.సేతు బంధన్ పథకం కింద మూడు ఆర్‌ఒబిఆర్‌యుబిప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయడం. హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65ను సర్వీస్ రోడ్లతో కలిపి ఆరు లేన్లుగా విస్తరించడం.

22న ‘ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి సవాళ్లు’ పై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

సైఫాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును విధ్వంసం చేసే కుట్ర కొనసాగుతున్నదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తితో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగానే ఈ ఎన్నికల ప్రక్రియను తప్పులతో కూడిన విధంగా మార్చుతున్నదని ఆరోపించారు. 22న కైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ‘ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి సవాళ్లు’ అనే అంశంపై జరుగనున్న సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టిందని, బీహార్, పశ్చిమ్ బెంగాల్‌లో జరిగిన ఎన్నికలే ఇందుకు నిదర్శనమన్నారు. 22న జరిగే సదస్సులో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ప్రజల కోసం రాజ్యాంగం..

రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు’ అనే నినాదంతో ఈ వేదిక పనిచేస్తుందన్నారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసిన ప్రశాంత్ భూషణ్ ప్రజల్లో ఉన్న సందేహాలను 22న జరిగే సదస్సులో నివృత్తి చేస్తారని తెలిపారు.

అమెరికాలో హైదరాబాద్ యువకుడి మృతి

అన్న చేతిలో తుపాకి పేలి ప్రాణాలు కోల్పోయిన తమ్ముడు

సైదాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త : హైద్రాబాద్‌కు చెందిన ఒక యువకుడు తన సోదరుడి చేతిలో ప్రమాదవశాత్తు తుపాకి కాల్పులకు గురై ప్రాణాలు కోల్పోయాడు. నవంబరు 14వ తేదీన ఈ సంఘటన జరగగా 17న నసావు కౌంటి పోలీసులు వివరాలు వెల్లడించారు. 14 అర్ధరాత్రి న్యూయార్క్ హిక్స్‌విల్ సమీపంలో కాల్పులు జరిగినట్లు అక్కడి పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు చేరుకుని గాయంతో ఉన్న ఇబ్రహీం అహ్మద్‌ను ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో ఇబ్రహీం తన అన్న మహ్మద్ బషీర్ అహ్మద్‌తో కలిసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అన్న వద్ద పిస్టల్ ప్రమాదవశాత్తు పేలడంతో ఇబ్రహీం వీపులోకి బుల్లెట్ దూసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలింది బషీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై హత్య కేసుతోపాటు అక్రమంగా తుపాకి ఉన్నట్లు మరో కేసును నమోదు చేశారు. ఘటనపై ఎంబిటి ప్రతినిధి అంజదుల్లా ఖాన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

వసుధైవ కుటుంబకం స్ఫూర్తితో ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో యువత భాగస్వాములు కావాలి

విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త:అంతర్జాతీయ వ్యవహారాలు, దౌత్య సంబంధాలు, ప్రజాస్వామ్య విలువలపై యువతకు అవగాహన కల్పిస్తూ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ (ఐఐఎంయూఎన్) వంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం, దృఢ సంకల్పం ద్వారానే నిజమైన నాయకత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ కుంట్లూర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించిన ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ (ఐఐఎంయూఎన్) హైదరాబాద్ చాప్టర్-2026 కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రపంచం ప్రస్తుతం వాతావరణ మార్పులు, వేగవంతమైన సాంకేతిక పరిణామాలు, అంతర్జాతీయ శాంతి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. వసుధైవ కుటుంబకం అనే భారతీయ తాత్విక భావనతో ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్న భారతదేశంలో, ఇలాంటి సమస్యల పరిష్కారంలో యువత చురుకైన, సృజనాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఎంయూఎన్ వేదికపై జరిగే చర్చలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, తార్కిక ఆలోచన, పరస్పర సమన్వయం, బృంద స్ఫూర్తి వంటి నైపుణ్యాలను పెంపొందిస్తాయని చెప్పారు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య మర్యాదలను పాటించడం పౌరసమాజానికి నిదర్శనమన్నారు.

అగ్నిమాపక, విపత్తుల ప్రతిస్పందన విభాగం డైరెక్టర్ జనరల్‌గా సజ్జనార్ పదవీ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్,నవంబరు 19,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల ప్రతిస్పందన విభాగం డైరెక్టర్ జనరల్‌గా గురువారం సీనియర్ ఐపీఎస్ అధికారి సివి సజ్జనార్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా నిర్ణయించుకున్న ముహూర్తం ప్రకారం ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా సమర్థవంతంగా సేవలు అందించిన ఆయన, బదిలీ ఉత్తర్వుల మేరకు ఈ విభాగానికి నియమితులయ్యారు. బదిలీ ఉత్తర్వులు వెలువడిన అనంతరం కొద్దిరోజుల పాటు విరామం తీసుకున్న సజ్జనార్.. తాజాగా పూర్తిస్థాయిలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సజ్జనార్ మీడియా ప్రతినిధులతో సమావేశమై, విభాగం పనితీరు, భవిష్యత్తు కార్యాచరణపై వివరించారు.రాష్ట్రంలో అగ్నిప్రమాదాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూ, అత్యవసర సమయాల్లో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంపై తమ శాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుందని సజ్జనార్ స్పష్టం చేశారు.

క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని.. ప్రతిదానికి ఓ సమయం ఉంటుంది

నీటి విధానంలో తప్పిదాలు కప్పిపుచ్చుకోవడానికి బిఆర్ఎస్ విమర్శలు: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్,నవంబరు19ప్రభాతవార్త: క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని. అన్నీ కూడా నిశితంగా పరిశీలిస్తున్నామనీ,సమయం వచ్చినప్పుడు అందరినీ పిలుస్తామనీ రాజగోపాల్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏ సందర్భంలో ఏం మట్లాడారో అవి అన్ని మాటలను పరిశీలిస్తామని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. గాంధీభవన్‌లో గురువారం విలేఖరులతో టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై స్పందిస్తూ ప్రతీ దానికి ఓ సమయం ఉంటదని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజ్ గోపాల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యల పై హైకమాండ్ దృష్టి సారించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం చేసిన వ్యాఖ్యలపై కొత్త ఇన్‌ఛార్జ్ రాగానే అన్ని అంశాలను పరిశీలిస్తారని టిపిసిసి చీఫ్ తెలిపారు.కొత్త ఇంచార్జీ సందీప్ నిబద్ధత గల నాయకుడు దేనికైనా సమయం రావాలి,సమయం బట్టీ నిర్ణయాలు ఉంటాయనీ చెప్పారు. కొండా సురేఖ విషయంలో చర్యలు తీసుకునే ముందు చాలా అవకాశాలు ఇచ్చామని గుర్తుచేశారు.కృష్ణా జలాల విషయంలో బిఆర్ ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసింది. నాడు 36 శాతం చాలని కెసిఆర్ అంగీకరించారనీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 70 శాతం వాటా కోసం పోరాడుతోందనీ అన్నారుబిఆర్ ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4.464 టిఎంసిల కృష్ణా జలాలను వినియోగించుకుంటే, తెలంగాణకు దక్కింది కేవలం 1,993 టిఎంసిలే అని ఆవేదన చెందారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోప భూయిష్టకంగా కట్టబడిందినేషనల్ డ్యామ్ అథారిటీ, జాతీయ స్థాయి నిపుణులు సర్టిఫై చేశారు నెహ్రూ హయంలో కట్టిన ప్రాజెక్టులు దేవాలయాలనీ బిఆర్ఎస్ చౌకబారు ప్రకటనల వల్ల ప్రయోజనం లేదనీ అన్నారు. నీటి విషయంలో తప్పిదాలను, ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మహేశ్ మండిపడ్డారు. కెటిఆర్ కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది కెసిఆర్ అంటూ వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ నేతలు ఎన్ని డ్రామాలు చేసినా ప్రయోజనం శూన్యమన్నారు.

రుజువులతో కళ్లకు కనపడుతున్న రేవంత్ అవినీతిపాలన: ప్రజాశాంతి పార్టీ అధినేత కెఏపాల్

హైదరాబాద్,నవంబరు 19,ప్రభాతవార్త: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి పాలన ఆకాశానికంటున్నదని అనేక రుజువుల్లో కళ్లకు కనబడుతున్నాయని ప్రజా శాంతి పార్టీ అధినేత కెఏ పాల్ విమర్శించారు. గురువారం కెఏ పాల్ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పుడు ఏడుగురు అన్నదమ్ములు దోచుకున్న ఆస్తి కొన్ని లక్షల కోట్లు అని బిఆర్ ఎస్ వాళ్లు, బిజెపివాళ్లు, నిపుణులు ఆరోపిస్తున్నారనీ,దాని మీద విచారణ లేదు సరికదా ఇప్పుడు మొన్న భారత్ సమ్మిట్ జరిగిందనీ ఎద్దేవా చేశారు.. నోవాటెల్ హోటల్‌లో ఎన్ని వందల కోట్లు ఖర్చు పెట్టారో లెక్కలేసుకోవాలన్నారు.భారత్ సమ్మిట్‌కి రాహుల్‌గాంధీ, ఇతర నేతలను పిలిపించుకోవడం తాగడం, డ్యాన్స్ లేయడం కళ్లతో అందరూ చూశారనీ విమర్శించారు. ఎందుకు కొన్ని మీడియా సంస్థలు ఈ విషయాన్ని రిపోర్ట్ చేయడం లేదని కెఏ పాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి అవినీతి పాలన చేస్తూ కనీసం తెలంగాణ ప్రజలకు మంచి నీళ్లు అందించలేకపోతున్నారని ఆవేదన చెందారు. ఇచ్చిన ఆరు వాగ్దానాలు ఇప్పటికీ నెరవేర్చలేదనీ రైతుల ఆత్మహత్యలు ఎక్కువైపోయాయనీ, తాగేందుకు కూడా నీళ్లు లేకపోతే ఇక పంటలేం పండుతాయని వాపోయారు.

పాకిస్థాన్‌ను రెండు దేశాలుగా విభజించిన దుర్గాదేవి ‘ఇందిర’

బంగ్లా విముక్తి బ్యాంకు జాతీయకరణ ఆమె నాయకత్వ పటిమకు నిదర్శనం

టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 19,ప్రభాతవార్త: భారత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పాకిస్తాన్‌ను రెండు దేశాలుగా విభజించి బంగ్లాదేశ్ అవతరణచేయడమే కాకుండా అక్కడి ప్రజలకు పశ్చిమపాకిస్తాన్ అరాచక పాలన నుంచి విముక్తి కల్పించిందని బిజెపి నాయకుడు అటల్‌బిహారి వాజపాయ్ కూడా ఇందిరను దుర్గాదేవిగా అభివర్ణించారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. భారత స్వర్ణీయ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో గురువారం ఆమె చిత్రపటానికి పూల మాలా వేసి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరగాంధీ 20సూత్రాల కార్యక్రమంతో దేశంను వడివడిగా అభివృద్ధి దిశకు తీసుకెళ్ళిందని గుర్తుచేశారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం ఆమె నిర్వహించిన దౌత్య నీతి ఎవరు చేయలేరని దీనితో ప్రపంచ దేశాలలో ఇండియా ఖ్యాతి పెరిగిందని బ్యాంకుల జాతీయకరణ భూసంస్కరణలతో గరీబీ హఠావో నినాదంను ఆచరణలో చూపారన్నారు.

ఒయూ లేడీస్ హాస్టల్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌ఐసి సభ్యురాలి అసంతృప్తి

విద్యార్థినులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా.. మార్పు కోసం కృషి చేస్తా: విజయభారతి సయాని



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని

తార్నాక, నవంబర్ 19 ప్రభాతవార్త : ఓ.యూ లేడీస్ హాస్టల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు ఎన్‌హెచ్ ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని హాస్టల్‌ను సందర్శించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లేడీస్ హాస్టల్‌లో భోజన వసతులు సరిగా లేవంటూ విద్యార్థినులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సభ్యురాలు విజయభారతి సయాని గురువారం హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. హాస్టల్‌లోని వసతులపై అసంతృప్తి వ్యక్తం చేసారు. భోజనం, తాగునీరు, పరిసరాలు గ్రంథాలయ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మార్పు తీసుకువచ్చేందుకు తరచూ విశ్వవిద్యాలయ అధికారులతో మాట్లాడతానని, పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కల్యాణి మాట్లాడుతూ.. హాస్టల్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని, కొందరు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, ఈ పరిణామం బాధాకరమని పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగుల సాధికారతకు దక్షిణ మధ్య రైల్వే ప్రాధాన్యం

హక్కులు, విధులు, సంక్షేమంపై రెండు రోజుల సదస్సు



ఉద్యోగినులతో మాట్లాడుతున్న రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే

తార్నాక, నవంబర్ 19 ప్రభాతవార్త : రైల్వే ప్రగతిలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకమని, వారి హక్కులు, భద్రత, సంక్షేమం, సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగుల హక్కులు, విధులు, సంక్షేమంపై రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సదస్సు నిర్వహించింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే సదస్సుకు నేతృత్వం వహించారు.వాణిజ్య విభాగంలోని మూడు డివిజన్లు, ప్రధాన కార్యాలయానికి చెందిన మహిళా ఉద్యోగులు, ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగ విధులు, బాధ్యతలతో పాటు కార్యాలయాల్లో మహిళలకు ఉన్న హక్కులు, రక్షణలపై వివరించారు. జన్ విశ్వాస్ చట్టం, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టంలోని నిబంధనలను వివరించారు. రాజ్యాంగం, రైల్వే నిబంధనల ప్రకారం ఉద్యోగులకు లభించే హక్కులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇతి పాండే మాట్లాడుతూ.. వాణిజ్య విభాగంలోని వివిధ రంగాల్లో మహిళా సిబ్బంది సాధిస్తున్న విజయాలను అభినందించారు. విధుల్లో ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ఆత్మవిశ్వాసం, పట్టుదలతో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ఉద్యోగంతో పాటు వ్యక్తిగత జీవితానికి సమతుల్యత పాటించాలని, ఆరోగ్యం, శారీరక దృఢత్వం, స్వీయ సంరక్షణకు సమయం కేటాయించాలని తెలిపారు.క్షేత్రస్థాయి ఉద్యోగులందరికీ అవకాశం కల్పించేందుకు రెండు రోజుల పాటు నాలుగు విడతల్లో సదస్సును నిర్వహించారు. టికెట్ తనిఖీ సిబ్బంది, బుకింగ

వార్త

ఏ పని అయినా తరచూ చేస్తూంటేనే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.

న- ఎడ్వర్డ్స్

కొండెక్కిన ధరలు!

సన్నాయినొక్కులే కానీ సంగీతం లేన్నట్టుగా ఉంది ధరల విషయంలో పాలకులు వ్యవహరిస్తున్న తీరు. అదుపు అజ్ఞాలేకుండా పెరిగిపోతున్న ధరలను నియంత్రిస్తాం, నల్ల బజారులపై ఉక్కుపాదం మోపుతామని పాలకులు పదేపదే మాటలు చెప్తున్నారే తప్ప ఆచరణలో ఏమీ చేయలేకపోతున్నారు. అధికారంలోకి ఎవరు వచ్చినా ఇదేపరిస్థితి. స్వరం మారుతున్నదే తప్ప పాట మాత్రం పాతదే అన్నట్లుగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధరల విషయంలో ఆవేదన, ఆందోళన వ్యక్తం చేసి రోడ్లపైకి వచ్చి, ఉద్యమాలు చేపట్టిన పెద్దలే అధికారంలోకి రాగానే మారిపోతున్నారేమో ననిపిస్తున్నది. ఇటీవల అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు సైతం విల విల్లాడిపోతున్నారు. ముఖ్యంగా పండుగ సీజన్‌లో ప్రజల అవసరాలను ముందుగా పసిగట్టి కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటున్నారు. ఇప్పుడు తాజాగా ఎల్‌నినో ప్రభావం అంటూ ధరలు సామాన్యులు అందుకోలేనంతగా పెంచుతున్నారు. ఒక రోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు. ఒక పట్టణంలో ఉన్న ధర మరో నగరంలో ఉండడం లేదు. ఇలా ధరలు కొండెక్కడానికి కారకులు ఎవరు? కారణాలు ఏమిటో? ఎవరికి చెప్పుకోవాలో? చర్యలు ఎవరు తీసుకుంటారో? దిక్కుతోచక సన్నజనంతోపాటు మధ్యతరగతి కూడా కొట్టుమిట్టాడుతున్నారు. పోని రైతులు ఉత్పత్తి చేస్తున్న పంటలకు ధర వస్తున్నదంటే అదీ లేదు. అక్కడ పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదు. రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు వాటి ధరలు పాతాళలోకానికి పడిపోతుంటే వారి వద్ద నుంచి ప్రైవేట్ వ్యక్తుల గోదాముల్లోకి చేరుకోగానే అందుకోలేనంతగా ఆకాశానికి చేరి కూర్చుకుంటున్నాయి. ఇదేదో ఇప్పుడే వచ్చిందని చెప్పడం లేదు. ఎప్పటి నుంచో జరుగుతున్నది. రానురాను పెరిగిపోతున్నది. ఈ విషయం పాలకులకు తెలియంది కాదు. కొందరు దళారులు కమిషన్ల రూపంలో కోట్లాది రూపాయలు భోం చేస్తున్నారు. చట్టప్రకారం లైసెన్సు పొందినా కొందరు నిబంధనలను అతిక్రమించి అటు రైతులను ఇటు వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు. ఇలా దోపిడీకి గురికాకుండా నివారించి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వినియోగదారులకు సరైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించడంలో కీలకపాత్ర వహించాల్సిన మార్కెట్ కమిటీలు రైతు భక్షక కంపెనీలుగా రూపాంతరం చెందాయి. దళారులు అదుపు చేయలేకపోగా కొన్ని ప్రాంతాల్లో వారితోనే కుమ్మక్కైపోతున్నారు. రైతుల సమస్యల పరిష్కారం వైపు అడుగులు పడడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ వేదికలెక్కి ఉపన్యాసాలు ఇచ్చే పెద్దలే మార్కెట్ కమిటీల విషయంలో అదే ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేస్తున్నారు. నామినేషన్ పద్ధతి ఎవరు, ఎప్పుడు, ఎందుకు ప్రవేశపెట్టారో కానీ ఈ మార్కెట్ కమిటీలు రైతుల పాలిట శాపాలుగా పరిణమించాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన రైతు ప్రతినిధులకు బదులు తమతమ అనుచరులను, సన్నిహితులను, కార్యకర్తలను, బంధుమిత్రులను ఈ కమిటీల్లో నియమించుకుంటున్నారు. చివరకు మార్కెట్ కమిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన రైతు ప్రతినిధులకు బదులు నేతల అభిష్టం మేరకు నింపుకుంటున్నారు. ఇందులోప్రజల చేత తిరస్కరించబడినవారు, ఎన్నికల్లో పోటీ చేసే సత్తా లేనివారు, ప్రజాసేవ అంటే ఏమిటో తెలియనివారికి ఈ కమిటీల్లో స్థానం కల్పిస్తున్నారు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద ఎంపికైన పాలక మండళ్ల ఉనికి నామమాత్రంగానే మిగిలిపోతున్నది. దీంతో రైతుల నుంచి వచ్చే సరుకుల ధరలను దళారులే నియంత్రిస్తున్నారు.అవసరం అనుకుంటే పోటీగా ఇతర ప్రాంతాల నుంచి సరుకులు తెప్పించి స్థానిక రైతుల ఉత్పత్తులకు ధరలు రాకుండా మోకాలొడ్డుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాదాపు కొనసాగుతున్నది. అందుకే ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో, ఎందుకు అలా జరుగుతున్నదో చెప్పలేని పరిస్థితి. వాస్తవంగా తెలుగు రాష్ట్రాల్లో వరిసాగు తీసుకున్నా గత ఐదారేళ్లుగా సాగు పెరగడమే కాదు, ధాన్యం దిగుబడి ఊహించని రీతిలో వచ్చింది. బియ్యానికేమీ ఇబ్బంది లేదు. కానీ ఎల్‌నినో ప్రభావంతో ముందుజాగ్రత్త చర్యలుగా తెలంగాణ ప్రభుత్వం రబీలో వరిసాగు చేయొద్దని రైతులను అభ్యర్థించింది. దీన్ని ఆసరాగా తీసుకొని రబీలో సాగు తగ్గి దిగుబడులు కూడా అదే స్థాయిలో పడిపోతాయని అంచనాలు వేసుకున్న కొందరు దళారులు బియ్యం రేటును ఒక్కసారిగా కిలో ఎనభైనుంచి వంద రూపాయల వరకు పెంచారు. ఇవి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాల్లోనే అంచనాలు వెలువడుతుంటే వినియోగదారుల్లో ఆందోళనలు మొదలయ్యాయి. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా తాత్కాలికంగా కొంత తగ్గినా మళ్లీ దళారులు అవకాశం కోసమే ఎదురుచూస్తున్నారు. అంతర్జాతీయ ధాన్యమండలి లెక్కల ప్రకారం పరిశీలించినా ప్రస్తుతానికి బియ్యానికికొరత లేదు. కానీ సమృద్ధిగా వరి ధాన్యం దిగుబడి లభించే భారతావనిలో ఇతర సరుకులతోసహా బియ్యం ధరలు ఆకాశాన్ని అంటడం సామాన్యులకు అంతుబట్టడం లేదు.నిత్యావసర వస్తువులే కాదు మందులు,బస్సు చార్జీలు ఇలా ఒక్కటేమిటి అన్నీ సామాన్యులు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఏదిఏమైనా అదుపు లేకుండాపెరిగిపోతున్న ఈ ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. పేద, బడుగు వర్గాలేకాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. సమస్యను ఇలానే నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో పాలకులు భారీ మూల్యం చెల్లించక తప్పదు.

నగరాలకు అభివృద్ధి.. ప్రకృతికి మనుగడ కావాలి

అంతిమంగా ఒక నగరం సాధించిన ప్రగతిని ఫ్లైఓవర్లు, ఆకాశహర్మ్యాలు, రహదారుల కిలోమీటర్లతో మాత్రమే కొలవకూడదు. స్వచ్ఛమైన గాలి, అందుబాటులో ఉండే పచ్చని ప్రదేశాలు, నిరంతర నీటి సరఫరా, సమర్థమైన మురుగు నీటిపారుదల, తీవ్రమైన వేడినుంచి రక్షణ కూడా అభివృద్ధికి కొలమానాలు కావాలి. ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. ప్రకృతిదృశ్యాలను కాంక్రీట్ అరణ్యాలుగా మార్చడమే ప్రగతి అన్న సంకుచిత ఆలోచన నుంచిబయటపడాలి. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయకుండా ప్రజలకు ఉపాధి,మెరుగైన జీవన ప్రమాణాలు, అవకాశాలను కల్పించే నగరాలే నిజ మైన అభివృద్ధికి ప్రతీకలు. నగరాలకు విస్తరణ కావాలి కానీ ప్రకృతిమనుగడకు తగినంత స్థలం కావాలి. ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించినప్పుడే భారతీయ నగరాల భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

డిజె మోహన రావు

ఆర్థిక ప్రగతికి నగరాల విస్తరణ అవసరమే. అయితే పర్యావరణ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ సాధించే అభివృద్ధి చివరకు నగరాల మనుగడకే ముప్పుగా మారుతుంది.' భారతదేశ నగరాలు వేగంగా విస్తరిస్తున్నాయి. కొత్త రహదారులు, ఫ్లైఓవర్లు, ఆకాశహర్మ్యాలు, పారిశ్రామిక కారిడార్లు పట్టణాల రూపురేఖలను మారుస్తున్నాయి. ఉపాధి అవకాశాలను పెంచుతూ, రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తున్న ఈ విస్తరణ దేశ ఆర్థిక ఆకాంక్షలకు ప్రతిబింబం. అయితే, ఈ ప్రగతి వెనుక ఒక తీవ్రమైన వైరుధ్యం దాగి ఉంది. నగరాలు ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో, వాటి మనుగడకు ఆధారమైన ప్రకృతి వనరులు అంతే వేగంగా కనుమరుగవుతున్నాయి. పర్యావరణ పునాదులను బలిపెట్టి సాధించే ఆర్థిక వృద్ధి ఎంతోకాలం నిలబడదు. ఈ సవాలు ఎంత పెద్దదో గణాంకాలే చెబుతున్నాయి. 2025 జూలైలో ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదిక ప్రకారం, భారత దేశ పట్టణ జనాభా 2050 నాటికి దాదాపు 95.1 కోట్లకు చేరుకోనుంది. 2030నాటికి దేశంలో కొత్తగా ఏర్పడే ఉద్యోగాల్లో 70 శాతం నగరాల నుంచే వస్తాయని అంచనా. ఇంతటి జనాభా అవసరాలను తీర్చాలంటే గృహవసతి, రవాణా, నీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ వంటిమౌలిక సదుపాయాలను భారీగా విస్తరించాల్సి ఉంటుంది. అయితే, సహజ వనరులను నాశనం చేసుకోకుండా నగరాలు ఈ అభివృద్ధిని ఎలా సాధిస్తాయన్నదే అసలు ప్రశ్న. అస్తవ్యస్త పట్టణీకరణకు కనిపిస్తున్న ప్రధాన పరిణామాల్లో సహజ జలవనరుల అంతర్ధానం ఒకటి. చెరువులు, కుంటలు, సరస్సులు, చిత్తడి నేలలు, సహజ వాగులు రియల్ ఎస్టేట్, వాణిజ్య కార్యకలాపాల కోసం క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఇవి అభివృద్ధికి అడ్డుగా ఉన్న ఖాళీ స్థలాలు కావు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, స్థానిక ఉష్ణోగ్రతలను నియంత్రించడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం వంటి కీలక విధులను నిర్వహిస్తాయి. వీటిని కోల్పోయినప్పుడు భారీ వర్షాలను తట్టుకునే సహజ సామర్థ్యాన్ని నగరాలు కోల్పోతాయి. అందుకే పట్టణ వరదలు కేవలం అధిక వర్షపాతం వల్లే సంభవించవు ప్రకృతి జలమార్గాలను నిర్లక్ష్యం చేయడం, అస్తవ్యస్త నిర్మాణాలు కూడా వాటికి ప్రధాన కారణాలే. 2026 జూలైలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ పట్టణ వరదలకు కారణమవుతున్న అంశాల్లో తక్కువ సమయంలో కురిసే భారీ వర్షాలు, ప్రణాళిక లేని విస్తరణ, జలవనరుల ఆక్రమణలు, సరైన మురుగునీటి పారుదల వ్యవస్థలు లేకపోవడం వంటివి ఉన్నట్లు గుర్తించింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో తరచూ ఎదురవుతున్న వరదలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రకృతి వ్యవస్థలు సమర్థంగా పనిచేస్తున్నప్పుడే కాంక్రీట్ మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉపయోగపడతాయి. పర్యావరణంపై పట్టణీకరణ ప్రభావం వరదలతోనే ఆగిపోవడం లేదు. కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం, వాహనాల రద్దీ అధికమవడం నగరాలను మరింత వేడిగా, అనారోగ్యకరంగా మారుస్తున్నాయి. 2025లో ప్రపంచ బ్యాంకు వెల్లడించిన అంచనాల ప్రకారం, కొన్ని భారతీయ నగరాల మధ్య ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు చుట్టుపక్కల ప్రాంతాల కంటే 3-4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం 'పట్టణ ఉష్ణద్వీప ప్రభావం'. మరోవైపు, కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ అధ్యయనం ప్రకారం దేశంలోని 57 శాతం జిల్లాల్లో నివసిస్తున్న 76శాతం జనాభా అధిక లేదా అత్యధిక వేడి ముప్పును ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా



బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, వీధి వ్యాపారులు, పిల్లలు, వృద్ధులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వాయు కాలుష్యం పట్టణ జీవనాన్ని దెబ్బతీస్తున్న మరో ప్రధాన సమస్య. వాహనాల పొగ, నిర్మాణ ధూళి, పారిశ్రామిక ఉద్గారాలు, చెత్త దహనం, డీజిల్ జనరేటర్లు నగర ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. సమర్థమైన ప్రజా రవాణా లేకపోవడం ప్రైవేటు వాహనాల వినియోగాన్ని పెంచుతూ కాలుష్యాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. కేవలం రహదారుల విస్తరణతో ఈ సమస్యతీరదు. సమ్మకమైన ప్రజా రవాణా, నడిచేందుకు అనువైన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ మార్గాలు, నివాస-వాణిజ్య ప్రాంతాల మధ్య సమర్థమైన అనుసంధానం అవసరం. జనాభా పెరుగుదల, నిర్మాణాల విస్తరణ నగరాల నీటి భద్రతపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నీటి అవసరాలు పెరుగుతున్న సమయంలో భూగర్భ జలాల పునరుద్ధరణ ప్రాంతాలు క్షీణిస్తున్నాయి. ఫలితంగా అనేక నగరాలు వందల కిలోమీటర్ల దూరంలోని నదులు, జలాశయాలపై ఆధారపడాల్సి వస్తోంది. నీటి సరఫరాను కేవలం ఇంజినీరింగ్ సమస్యగా చూడటం సరైన విధానం కాదు. స్థానిక చెరువులు, నీటి పరీవాహక ప్రాంతాలను కాపాడకుండా దీర్ఘకాలిక నీటి భద్రత సాధ్యం కాదు. వర్షపు నీటి సంరక్షణ, శుద్ధి చేసిన మురుగు నీటి పునర్వినియోగం నగర ప్రణాళికలో తప్పనిసరికావాలి. ఈ సమస్యలు మహానగరాలకే పరిమితం కాలేదు. చిన్న పట్టణాలు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు కూడా సరైన మాస్టర్ ప్లాన్లు, వ్యర్థాల నిర్వహణ సదుపాయాలు లేకుండానే విస్తరిస్తున్నాయి. 2026జూలైలో వరల్డ్‌రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించిన అధ్యయనం ప్రకారం, భారతదేశ పట్టణీకరణ అధికారిక నగర పరిధులను దాటి శివారు ప్రాంతాల్లోనూ వేగంగా జరుగుతోంది. అందువల్ల మున్సిపల్ సరిహద్దులను దాటిసమన్వయంతో కూడిన ప్రాంతీయప్రణాళిక అవసరం మరింత పెరిగింది. స్థిరమైన పట్టణాభి వృద్ధి కోసం భారతదేశంలో విధానాలు,చట్టాలు లేవనికాదు. వాటి అమలు,జవాబుదారీతనంలోనే అసలు లోపాలున్నాయి. రియల్ ఎస్టేట్, వ్యాపార ప్రయోజనాల ఒత్తిడితో మాస్టర్ ప్లాన్లలో తరచూనిబంధనలను సడలించడం,మున్సిపాలిటీలు, జలమండలి, రెవెన్యూ,అటవీ శాఖలమధ్య సమన్వయ లోపం, పట్టణ స్థానిక సంస్థలకు తగిన ఆర్థిక, సాంకేతిక స్వయం ప్రతిపత్తి లేకపోవడం ప్రధాన అడ్డంకులుగా మారాయి. పర్యావరణ అనుమతులు కేవలంకాగితాలకే పరిమితం కాకూడదు. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందే వరద మైదానాలు, చిత్తడినేలలు, కొండ ప్రాంతాలు,సహజ జల మార్గాలను గుర్తించి కఠినంగా రక్షించాలి. పట్టణాభివృద్ధి పర్యవేక్షణలో పౌరుల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. 2050నాటికి భారత్‌కు పర్యావరణ అనుకూల, వాతావరణ మార్పులను తట్టుకోగల పట్టణ మౌలికసదుపాయాల అభివృద్ధికి 2.4లక్షల కోట్లడాలర్లకు పైగా పెట్టుబడి అవసరమవుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఈ భారీ పెట్టుబడులను నగరాల రూపురేఖలను మార్చుకునే అవకాశంగా మలుచుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా పలు నగరాలు అనుసరిస్తున్న 'స్పాంజ్ సిటీ' నమూనాను, 'నీలిఆకుపచ్చ మౌలిక సదుపాయాలను' మన నగరాలకు అన్వయించుకోవాలి. నీరు భూమిలోకి ఇంకేలా రూపొందించిన రహదారులు,పట్టణ అడవులు,చెరువుల పునరుద్ధరణ, వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ, ఇంధన సామర్థ్యం కలిగిన ప్రజారవాణా వ్యవస్థలను అభివృద్ధిలో అంతర్భాగంచేయాలి. అంతిమంగా ఒక నగరం సాధించిన ప్రగతిని ఫ్లైఓవర్లు, ఆకాశహర్మ్యాలు, రహదారుల కిలోమీటర్లతో మాత్రమే కొలవకూడదు. స్వచ్ఛమైనగాలి, అందుబాటులో ఉండే పచ్చనిప్రదేశాలు, నిరంతర నీటి సరఫరా,సమర్థమైన మురుగు నీటిపారుదల, తీవ్రమైన వేడినుంచి రక్షణ కూడాఅభివృద్ధికి కొలమానాలు కావాలి. ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. ప్రకృతిదృశ్యాలను కాంక్రీట్ అరణ్యాలుగా మార్చడమే ప్రగతి అన్న సంకుచిత ఆలోచన నుంచిబయటపడాలి. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయకుండా ప్రజలకు ఉపాధి,మెరుగైన జీవన ప్రమాణాలు, అవకాశాలను కల్పించే నగరాలే నిజమైన అభివృద్ధికి ప్రతీకలు. నగరాలకు విస్తరణ కావాలి కానీ ప్రకృతిమనుగడకు తగినంత స్థలం కావాలి. ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించినప్పుడే భారతీయ నగరాల భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

ఏవీ ఆ పెట్టుబడులు.. ఉపాధి, ఉద్యోగాలు?

డాక్టర్ మోటె చిరంజీవి

దేశ ఆర్థిక వ్యవస్థకు పారిశ్రామిక రంగం వెన్నెముక. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు దేశ సంపద సృష్టిలో కీలక పాత్ర పోషించేది పరిశ్రమలే. అలాంటి పారిశ్రామిక రంగం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది.ఒకవైపు పెట్టుబడుల పేరుతో భారీ ప్రకటనలు, మరోవైపు క్షేత్రస్థాయిలో పరిశ్రమల స్థాపనలో మందగమనం,ఆశించిన స్థాయిలో ఉద్యోగాల కల్పన లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ముఖ్యంగా తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి గణాంకాలు పరిశీలిస్తే ఈ పరిస్థితి మరింత స్పష్టమవుతోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత పెరిగింది. టీఎస్ఐపాస్ వంటి విధానాలతో పరిశ్రమలకు అనుమతులు వేగంగా ఇచ్చే వ్యవస్థను తీసుకొచ్చారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నకొద్దీ పారిశ్రామిక ప్రగతివేగం, పెట్టుబడుల వాస్తవికత, ఉపాధికల్పనపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. తాజాగా వెలువడిన గణాంకాలు రాష్ట్ర పారిశ్రామిక రంగంలో నెలకొన్న ఒడిదుడుకులను వెల్లడిస్తున్నాయి. 2023-24లో తెలంగాణలో 2,493 పారిశ్రామిక యూనిట్ల ద్వారా రూ.24,690.69 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా80,583 మందికి ఉపాధి లభించింది. అయితే 2024-25లో పరిశ్రమల సంఖ్య 2,005కు పడిపోయింది. పెట్టుబడులు రూ.11,719.90 కోట్లకు తగ్గగా, ఉపాధి అవకాశాలు 49,523వేలకు పరిమితమయ్యాయి. అంటే అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఉపాధి కల్పనలో ఏకంగా 38.5శాతం క్షీణత నమోదైంది. 2025-26లో పరిశ్రమల సంఖ్య 2,160కు పెరిగినా పెట్టుబడులు రూ.10,236.76 కోట్లకు తగ్గాయి.ఉపాధి కల్పన 51,005కు మాత్రమే చేరింది. ఇవి ప్రభుత్వ టీజీఐపాస్ గణాంకాల ఆధారంగా వెల్లడైన వివరాలను చూసినట్లయితే దావోస్ సదస్సులు, గ్లోబల్ సమ్మిట్‌లు, విదేశీ పర్యటనలు,భారీ పెట్టుబడుల ఒప్పందాలు ప్రభుత్వ ప్రచారానికి ఉపయోగపడవచ్చు. కానీ వాటి అసలు ఫలితం ఎన్ని పరిశ్రమలు స్థాపించబడ్డాయి. ఎన్ని ఉత్పత్తి ప్రారంభించాయి. ఎంతమందికి శాశ్వత ఉద్యోగాలు లభించాయి అనే ప్రశ్నలతోనే కొలవాలి. పెట్టుబడుల ఒప్పందాలు కుదరడం ఒక దశ మాత్రమే. అవి కార్యరూపం దాల్చి ఉత్పత్తి ప్రారంభించినప్పుడే పారిశ్రామిక అభివృద్ధికి నిజమైన అర్థం ఉంటుంది. దేశవ్యాప్తంగా కూడా పారిశ్రామిక రంగం సవాళ్లను ఎదుర్కొంటోంది. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకుతీసుకొచ్చిన టిఎస్ ఐపాస్ విధానంపెట్టుబడిదారులకు ఆకర్షణగా నిలిచింది. 2014-23 మధ్యకాలంలో ఈ విధానం ద్వారా 22,776వేలకు పైగా పారిశ్రామిక అనుమతులు మంజూరయ్యాయి. వీటి ద్వారా సుమారు రూ.2.60 లక్షల కోట్ల పెట్టుబడులు,17.55 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు ప్రతిపాదించబడ్డాయి. ఐటీ రంగంలోనూ తెలంగాణ దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014-15లో రూ.66,276 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు 2022-23 నాటికి రూ.2,41,275 కోట్లకు చేరాయి. అంటే దాదాపు 264 శాతం వృద్ధి నమోదైంది.ఇదే సమయంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య 3.71 లక్షల నుంచి 9.05 లక్షలకు పెరిగింది. తొమ్మిదేళ్లలో 5.33 లక్షలకు పైగా ఉద్యోగుల పెరుగుదల నమోదైంది.టీహబ్, టీవర్క్స్, వీహబ్ వంటి సంస్థలద్వారా స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం లభించింది.కాకతీయ మెగాటెక్స్ టైల్ పార్కు, వరంగల్ ఐటీటవర్ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్‌కు వెలుపల కూడా పారిశ్రామిక, ఐటీ అభివృద్ధికి బాటలు వేశాయి.ఈ గణాంకాలు తెలంగాణ పారిశ్రామిక, ఐటీ రంగాల విస్తరణను తెలియజేస్తున్నాయి.

ఆధునిక యుగంలోనూ బాల్యవివాహాలేనా?

తిప్పర్తి శ్రీనివాస్

బాల్యం అనేది ప్రతి మనిషి జీవితంలో అత్యంత విలువైన దశ. చదువుకుంటూ, ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన వయసులోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టాల్సి రావడం ఎంతోమంది బాలికల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది.ఆధునిక సమాజం సాంకేతికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, బాల్య వివాహాల వంటి సామాజిక దురాచారం ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరం. పేదరికం, నిరక్షరాస్యత, లింగ వివక్ష, సామాజిక కట్టుబాట్లు, ఆర్థిక ఇబ్బందులు ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడంలేదు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు మరింత సమర్థవంతమైన కార్యాచరణ అవసరం. భారతదేశంలో బాల్య వివాహాల ప్రాబల్యం క్రమంగా తగ్గుతున్నట్లు తాజాగా విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023-24 సర్వే ప్రకారం, 20నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో 18ఏళ్ల నిండకముందే వివాహం చేసుకున్నవారి నిష్పత్తి 20.1 శాతానికి తగ్గింది. 2019-21లో నిర్వహించిన ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో ఈ నిష్పత్తి 23.3 శాతంగా నమోదైంది. అంతకుముందు 2015-16లో 26.8 శాతంకాగా, 2005-06లో ఏకంగా 47.4 శాతంగా ఉండేది. దాదాపు రెండు దశాబ్దాల్లో బాల్య వివాహాల ప్రాబల్యం గణనీయంగా తగ్గడం స్వాగతించదగిన పరిణామం. బాలికల విద్య, మహిళా సాధికారత, సామాజిక చైతన్యం పెరుగుతున్నాయనడానికి ఇది నిదర్శనం. అయితే,ఇప్పటికీ ప్రతి ఐదుగురు యువతుల్లో ఒకరు 18ఏళ్లలోపే వివాహం చేసుకుంటున్నారంటే సమస్య తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనలో భారత్ పాత్ర అత్యంత కీలకం. యునిసెఫ్ అంచనాల ప్రకారం, దేశంలో సుమారు 22.24 కోట్ల మంది బాలికలు, మహిళలు 18 ఏళ్ల నిండకముందే వివాహం చేసుకున్నవారిగా గుర్తించబడ్డారు. వారిలో సుమారు 9.05 కోట్ల మంది 15 యేళ్ల లోపే వివాహ బంధంలోకి ప్రవేశించారు. ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహ బాధిత బాలికలు, మహిళల్లో దాదాపు మూడింట ఒక వంతు మంది భారత్‌లోనే ఉండటం సమస్య ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. ఈ గణాంకాలు ఒకే ఏడాదిలో జరిగిన వివాహాలనుసూచించవు. వివిధ వయసుల మహిళల్లో గతంలో బాల్య వివాహానికి గురైనవారి మొత్తం సంఖ్యను సూచిస్తాయి.అందువల్ల ప్రాబల్యం తగ్గుతున్నప్పటికీ, లక్షలాది బాలికల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ఇంకా మిగిలేఉంది. తెలుగు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే కొన్ని ఆశాజనకమైన మార్పులు కనిపిస్తున్నాయి. తెలంగాణలో 2019-21లో 20-24ఏళ్ల మహిళల్లో 23.5శాతం మంది 18 ఏళ్లలోపే వివాహంచేసుకోగా,



2023-24 నాటికి ఈ నిష్పత్తి 17.9 శాతానికి తగ్గింది. అంటే 5.6 శాతం పాయింట్ల తగ్గుదల నమోదైంది.జాతీయ సగటు 20.1 శాతంతో పోలిస్తే తెలంగాణ మెరుగైన స్థితిలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ బాల్య వివాహాల ప్రాబల్యం 29.3 శాతం నుంచి 25.1 శాతానికి తగ్గినప్పటికీ,జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ గణాంకాలు తెలుగు రాష్ట్రాల్లో బాలికల విద్య, సామాజిక చైతన్యం పెరుగుతున్నాయని సూచిస్తున్నా, సమస్య పూర్తిగా పరిష్కారమైందని భావించడానికి వీల్లేదు. బాల్య వివాహాలు బాలికల జీవితాలపై చూపే ప్రభావం తీవ్రంగా ఉంటుంది. చిన్న వయసులోనే వివాహం కావడంతో చాలా మంది బాలికలు చదువుకు దూరమవుతున్నారు. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. బాల్య వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల వివాహానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది బాలికల విద్యా హక్కు, ఆరోగ్య హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ,సమాన అవకాశాలకు సంబంధించిన మానవ హక్కు ల సమస్య. బాల్య వివాహాల నివారణకు భారతదేశంలో చట్టపరమైన రక్షణ ఉంది. బాల్య వివాహాల నిషేధ చట్టం- 2006 ప్రకారం పురుషుడికి 21 సంవత్సరాలు, మహిళకు 18 సంవత్సరాలు నిండకముందు జరిగే వివాహాలు బాల్య వివాహాల పరిధిలోకి వస్తాయి.ఇటువంటి వివాహాలను అడ్డుకునేందుకు బాల్య వివాహ నిరోధక అధికారులు, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవచ్చు. అయినప్పటికీ, చట్టాలు కాగితాలకే పరిమితమైతే ప్రయోజనం ఉండదు. గ్రామీణ ప్రాంతాల్లో రహస్యంగా జరిగే వివాహాలను ముందుగానే గుర్తించడం, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, బాధిత బాలికలకు తక్షణ రక్షణ కల్పించడం అత్యంత అవసరం. బాలికకు రక్షణ కల్పించిన తర్వాత ఆమెచదువు కొనసాగించేలా, ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వ వ్

కాంగ్రెస్ పొత్తుపై
పునఃపరిశీలించుకోవాలి
♦ సిఎం విజయ్‌కు తమిళిసై సలహా



చెన్నై, నవంబరు 19: తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీ... కాంగ్రెస్‌తో ఉన్న పొత్తుపై పునరాలోచన చేయాలని బిజెపి సీనియర్ నాయకురాలు, మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. తిరుచిరాపల్లి విమానాశ్రయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. విజయ్ సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాలపై పలు విమర్శలు చేశారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన సోనియా గాంధీ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్... అక్కడే ఉన్న కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఎదుట కావేరి జలాల సమస్యను లేవనెత్తకపోవడం అన్యాయమని తమిళిసై అభిప్రాయ పడ్డారు. మేకెదాటు డ్యామ్ నిర్మాణంపై కర్ణాటక తీసుకుంటున్న వైఖరిని నిరసిస్తూ ఆ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బహిష్కరించి ఉండాల్సిందని ఆమె సూచించారు. కాంగ్రెస్ వైఖరిపై చరిత్రను దృష్టిలో పెట్టుకుని, వారితో పొత్తు అంశాన్ని టివికె పార్టీ సమీక్షి ం చుకోవాలని ఆమె అన్నారు.

హిందూ వ్యతిరేక ధోరణి తగదు....

తిరుప్పరంకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడాన్ని తమిళిసై తప్పుపట్టారు. విజయ్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆరు నెలల టివికె ప్రభుత్వ పనితీరు చెప్పుకోదగ్గ స్థాయిలో లేదని విమర్శించిన ఆమె... తమిళనాడులో డిఎంకె, టివికె రెండు పార్టీలనూ బీజేపీ రాజకీయంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. సర్ లేకపోతే విజయ్ సీఎం అయ్యేవారు కాదని తమిళిసై వ్యాఖ్యానించారు.

పంబా నదిలో
దుస్తులు వదలొద్దు
♦ అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం విజ్ఞప్తి



శబరిమల, నవంబరు 19 : శబరిమల యాత్రకు వెళ్లే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) కీలక విజ్ఞప్తి చేసింది. పవిత్రమైన పంబా నదిలో స్నానమాచరించిన అనంతరం భక్తులు తమ దుస్తులను నదిలోనే వదిలివేయవద్దని కోరాయి. ఈ విషయంపై భక్తులకు అవగాహన కల్పించాలని కోరుతూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు బోర్డు లేఖలు రాసింది. వార్షిక మండల మకరవిళక్కు యాత్ర ప్రారంభమైన నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు తెలియజేసింది. పంబా నదిలో దుస్తులు విడిచిపెడుతుండటంతో నదిలో కాలుష్యం ఏర్పడుతోందని ఆలయాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. పంబానదిలో దుస్తులు వదిలేయాలనే నిబం ధన ఏ శాస్త్రంలోనూ, అయ్యప్ప పూజా విధానం లోనూ లేదని దేవస్థానం బోర్డు స్పష్టం చేసింది.

జ్యూయెలరీ షాపులో
పట్టపగలే దోపిడీ

బెతియాబీహార్, నవంబరు 19: బీహార్‌లోని బెతియాలో పట్టపగలే భారీ దోపిడీ జరిగింది. బుధవారం మధ్యాహ్నం కాళీబాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుప్రియా సినిమా రోడ్డులో ఉన్న సెంకో గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెలరీ షోరూంపై ఆయుధాలతో కొందరు దుండగులు దాడి చేశారు. సుమారు 6 నుంచి 8 మంది నేరస్తులు తుపాకులు, ఇతర ఆయుధాలతో షోరూంలోకి ప్రవేశించి సిబ్బందిని బెదిరించి బందీలుగా చేసుకున్నారు. ఆ తర్వాత బంగారం, వెండి ఆభరణాలు, నగదును దోచుకుని పారిపోయారు. దుండగుల చేతితో తుపాకులు, ఇతర ఆయుధాలు ఉన్నట్లు తెలుస్తోంది. షోరూంలోని ఉద్యోగుల్ని ఆయుధాలతో బెదిరించి, సంచుల్లో ఆభరణాలను వేసుకుని వెళ్లిపోయారు. దుండగులు దోచుకెళ్లిన ఆభరణాల విలువ కోట్ల రూపాయల్లో ఉంటుందని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ దోపిడీని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఒక ఉద్యోగిపై దాడి చేశారు. తుపాకీతో దాడి చేసి గాయపరిచారు. రద్దీగా ఉండే రోడ్డులో పట్టపగలే ఈ దోపిడి జరగడం సంచలనంగా మారింది. ఘటనా స్థలానికి చంపారన్ రేంజ్ డీఐజీ హర్ కిషోర్ రాయ్, ఎస్ఎస్పీ కుమార్ గౌతమ్ భారీ పోలీసు బలగాలతో చేరుకున్నారు. షోరూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

జిటిఎ5 నుంచి జిటిఎ6 వరకూ అద్వితీయ ప్రగతి

దేశంలో అనూహ్య మార్పులు : గేమింగ్ వీడియోను పోలుస్తూ ప్రధాని మోడీ ట్వీట్



న్యూఢిల్లీ, నవంబరు 19: ప్రపంచ వ్యాప్తంగా గేమింగ్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వీడియో గేమ్ జిఎటి6 మరోసారి వార్తల్లో నిలిచింది. ఈసారి గేమ్‌కు సంబంధించిన ప్రత్యేకతల వల్ల కాదు భారత ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ఆసక్తికరమైన వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారింది.జిఎటి 5 విడుదలైన 2013 నుంచి జిఎటి 6 విడుదల వరకు గడిచిన 13 ఏళ్ల కాలాన్ని ప్రస్తావిస్తూ భారత్‌లో చోటుచేసుకున్న అభివృద్ధిని వివరించారు. ఆర్థిక వ్యవస్థ నుంచి మౌలిక సదుపాయాలు, సోలార్ ఎనర్జీ, రక్షణ రంగం వరకు భారత్‌లో వచ్చిన మార్పులను 10 స్లైడ్ల ద్వారా వివరించారు. ప్రసిద్ధ గేమింగ్ సంస్థరాక్‌స్టార్ గేమ్స్ రూపొందించిన జిటిఎ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందింది. ఈ సిరీస్‌లో జిటిఎ 5 గేమ్ 2013లో విడుదలైంది. దాదాపు 13 ఏళ్ల తర్వాత జిటిఎ6 కోసం గేమింగ్ అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ సుదీర్ఘ విరామాన్ని ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశ అభివృద్ధితో పోల్చారు. గురువారం సోషల్ మీడియా వేదికగా 10 స్లైడ్లతో కూడిన ప్రత్యేక పోస్టును షేర్ చేశారు 2013లో జిటిఎ 5 విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు దేశంలో జరిగిన మార్పులను ఇందులో ప్రస్తావించారు. భారత్ సరికొత్తగేమ్ కొనసాగిస్తోందంటూ భారత్ ఇప్పుడు సరికొత్త దిశలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మోడీ షేర్ చేసిన స్లైడ్లలో భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. అలాగే 2013తో పోలిస్తే పేదరిక స్థాయిల్లో వచ్చిన తగ్గుదలను కూడా అభివృద్ధిలో కీలకమైన మార్పుగా చూపించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పారిశుద్ధ్యానికి ఇచ్చిన ప్రాధాన్యతను స్లైడ్లలో హైలైట్ చేశారు. సోలార్ ఎనర్జీ రంగంలోనూ భారత్ గణనీయమైన పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. 2013తో పోలిస్తే దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థం గణనీయంగా పెరిగిన విషయాన్ని వివరించారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం ద్వారా ఇంధన రంగంలో భారత్ కొత్త అవకాశాలను సృష్టించుకుంటోందని ఈ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. భారత అంతరిక్ష రంగంలో వచ్చిన మార్పులను కూడా మోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

రక్షణ రంగం హైలెట్

భారత రక్షణ రంగం నుంచి ఇతర దేశాలకు జరిగే ఎగుమతులు పెరిగిన విషయాన్ని హైలైట్ చేశారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో స్వదేశీ సామర్థ్యాన్ని పెంచుకోవడం, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రక్షణ ఉత్పత్తులకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలు దేశ అభివృద్ధిలో కీలకంగా మారాయి. దేశ అంతర్గత భద్రతలో వచ్చిన మార్పులను కూడా ఈ 10 స్లైడ్లలో ప్రస్తావించారు. ముఖ్యంగా నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో భద్రతా పరిస్థితులు మెరుగుపడినట్లు ప్రధాని పేర్కొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అవసరం

పొదుపు, ఆర్థిక క్రమశిక్షణలపై ప్రధాని నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం కేంద్ర మంత్రివర్గానికి కీలక సూచనలు చేశారు. భారతీయ సంస్కృతి పొదుపుపై ఆధారపడి ఉందని తినడం, తాగడం, ఎంజాయ్ చేయడం మన భారతీయ సంస్కృతి కాదన్నారు. ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడంలో మనం సాధించిన పురోగతి, ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే మళ్లీ ప్రమాద స్థితికి చేరుతామని మంత్రుల్ని హెచ్చరించారు. ప్రజల పొదుపును ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ప్రధాని నొక్కిచెప్పారు. 2011 నుంచి 2023 మధ్యకాలంలో దేశంలోని దాదాపు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని, ఇది దేశం సాధించిన పెద్ద విజయమని ఈ విజయాన్ని జాతీయ వేడుకగా జరుపుకోవాల్సిన సందర్భమని ప్రధాని మోడీ అభివర్ణించారు. పేదరికం నుంచి బయటకు తీసుకురాకడం మాత్రమే సరిపోదని, మళ్లీ ప్రజలు పేదరికంలోకి వెళ్లకుండా నిరంతర ప్రయత్నాలు అవసరమని ఆయన హెచ్చరించారు. న్యూఢిల్లీలో భారత్ మండపంలో జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశం మూడున్నర గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశంలో డ్రగ్స్, అంతర్గత భద్రత వంటి కీలక అంశాలపై కూడా చర్చించారు. డ్రగ్స్ దుర్వినియోగం గురించి మాట్లాడిన సమయంలో మోడీ భావోద్వేగానికి గురయ్యారు. దేశ యువతను డ్రగ్స్ నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఇందిరాగాంధీకి మోడీ నివాళి

భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. గురువారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఆమె సేవలను స్మరించుకుంటూ ఒక పోస్ట్ చేశారు. మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ గారి జయంతి సందర్భంగా వారికి నా నివాళులు అర్పిస్తున్నాను అంటూ మోడీ తన సందేశంలో పేర్కొన్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో
ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ,నవంబరు 19: ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ వ్యక్తి కలకలం సృష్టించాడు. సరైన పత్రాలు లేకుండా టెర్మినల్3లోకి బలవంతంగా ప్రవేశించేందుకు యత్నించగా, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది అడ్డుకున్నారు. మధ్యాహ్నం సమయంలో టెర్మినల్3 డిపార్చర్ గేట్‌వద్ద ఈ ఘటన జరిగింది. హర్యానాకు చెందిన వ్యక్తిగా గుర్తించిన సదరు నిందితుడిని టికెట్, గుర్తింపు కార్డు చూపాలని భద్రతా సిబ్బంది కోరగా, అతడు ఏమాత్రం పట్టించుకోలేదు. వారిని తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ) సహాయంతో అతడిని క్షణాల్లో అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై సీఐఎస్ఎఫ్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. తమ సిబ్బంది అసాధారణ అప్రమత్తత, శీఘ్ర స్పందనతో భద్రతా వైఫల్యాన్ని నివారించారని పేర్కొంది. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా పంచుకుంది.

ప్రకృతిని దోచుకుంటున్న పాకిస్థాన్

న్యూయార్క్,నవంబరు 19: పాకిస్థాన్ సహజ వనరులను ఆ దేశ సైన్యం స్వప్రయోజనాల కోసం ఏ విధంగా కొల్లగొడుతోందో ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ ఎండగట్టింది. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి మిలిటరీ పెద్దలు దేశ సంపదతో జేబులు నింపుకుంటున్నారని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పి.హరీశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వచ్చే నెల భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న లైబీరియా సహజ వనరులసంఘర్షణ: నివారణ, శాంతి కోసం సహకారాన్ని బలోపేతం చేయడం అనే అంశంపై నిర్వహించిన అనధికారిక సమావేశంలో హరీశ్ ప్రసంగించారు. గతేడాది సెప్టెంబరులో పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ చెక్క పెట్టెలో ఖనిజాలను పెట్టి విదేశీ నేతలకు చూపించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దేశ సహజ వనరుల దోపిడీలో పాక్ సైన్యం ప్రత్యక్ష ప్రమేయానికి ఇదే స్పష్టమైన నిదర్శనమని విమర్శించారు.ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్తాన్ తెహ్రీక్ ఎఇన్సాఫ్ ప్రభుత్వాన్ని రద్దు చేయడం, అక్కడ ఎమర్జెన్సీ విధించడం వెనుక కూడా సైన్యం అత్యాశే కారణమని హరీశ్ ఆరోపించారు.

స్టాలిన్‌ను ఓడించిన ఎమ్మెల్యే కన్నుమూత



చెన్నై,నవంబరు 19: తమిళనాడు రాజకీయాల్లో విషాదం చోటుచేసుకుంది. కొలత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఓడించి సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే వీఎస్ బాబు (75) కన్నుమూశారు. తీవ్రమైన శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఆయన గత సెప్టెంబర్ 9న చెన్నై అమింజికరైలోని ఎంజీఎం హెల్త్‌కేర్ ఆసుపత్రిలో చేరారు. అప్పటి నుంచి వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో, ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అయితే వైద్య బృందం ఎంతగా ప్రయత్నించినా ఆయన ఆరోగ్యం మరింత విషమించింది. ఈ క్రమంలోనే నేడు మధ్యాహ్నం 2.24 గంటలకు ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు అధికారిక ప్రకటనలో వెల్లడించాయి. వీఎస్ బాబు తన రాజకీయ ప్రస్థానాన్ని డీఎంకే పార్టీలో ఒక సాధారణ ఏరియా కార్యదర్శిగా ప్రారంభించి, ఉత్తర చెన్నై జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో పురసవాక్కం నియోజకవర్గం నుంచి డీఎంకే అభ్యర్థిగా పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2008లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన కొలత్తూరు నియోజకవర్గంలో 2011లో స్టాలిన్ విజయం సాధించడంలో బాబు కీలక పాత్ర పోషించారు.

స్కార్పియో బోల్తా, ఆరుగురి మృతి

అరారియా,బిహార్,నవంబరు 19: బీహార్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. వేగం గా వెళ్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి వంతెనపై నుంచి లోతైన కాలువలో పడిపోవడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పో యారు. మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాదకర సంఘటన అరారియా జిల్లాలోని తారాబారి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. సుపౌల్ జిల్లా పిప్రా ప్రాంతంలోని ధుమ్హా గ్రామానికి చెందిన ఏడుగురు స్కార్పియోలో సిట్టీ ప్రాంతంలోని భట్టియా గ్రామంలో జరిగిన పెళ్లి వేడుకకు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో బీడీ వంతెన వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపు దగ్గర వాహనం అదుపుతప్పి నీటిలో పడిపోయింది.

బిఎస్-6 వాహనదారులకు ఊరట



♦ మూడేళ్లకోసారి పీయూసీ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం
♦ వాహనాల రకాన్ని బట్టి గడువులో మార్పులు
♦ అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు 56,610 బీఎస్-6 వాహనాల రిజిస్ట్రేషన్

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త: వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం(పీయూసీ) విషయంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. బీఎస్-6 ప్రమాణాలతో కూడిన ప్రైవేటు వాహనాలకు ఇకపై మూడేళ్లకోసారి పీయూసీ సర్టిఫికెట్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మోటారు వాహనాల నిబంధ నలకు సవరణలుచేస్తూ నవంబర్ 13న నోటిఫికేషన్ జారీచేసింది. కొత్త నిబంధనలు గెజిట్‌ప్రచురణ తేదీనుంచి అమల్లోకి వచ్చాయి.

జిల్లాలో 56,610 బీఎస్-6 వాహనాలు

2020 ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశంలో బీఎస్-6 ప్రమాణాలతో కూడిన వాహనాల రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు అనంతపురం జిల్లాలో మొత్తం 56,610 బీఎస్-6 వాహనాలు రిజిస్ట్రేషన్ అయినట్లు ఉప రవాణా శాఖ కమిషనర్ వీర్రాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా మార్పులతో జిల్లాలోని వేలాది మంది బీఎస్-6 వాహనదారులకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా కొత్త వాహనాలకు పీయూసీ సర్టిఫికెట్ పునరుద్ధరణ వ్యవధి పెరగడంతో తరచూ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం తగ్గనుంది.

వాహనాల వయస్సును బట్టి గడువు

కొత్త నిబంధనల ప్రకారం వాహనాల ఉద్గార ప్రమాణాలు, వయస్సు ఆధారంగా పీయూసీ సర్టిఫికెట్ గడువును నిర్ణయించారు. బీఎస్-6 ప్రమాణాలతో ఉన్న ఆరేళ్లలోపు ప్రైవేటు వాహనాలకు మూడేళ్లపాటు పీయూసీ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుంది. ఆరేళ్లు దాటిన వాహనాలకు ఏడాదికోసారి, పదేళ్లు దాటిన వాహనాలకు ప్రతి ఆరు నెలలకోసారి సర్టిఫికెట్ పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది.

రవాణా వాహనాలకు ప్రత్యేక గడువు:

బీఎస్-6 ప్రమాణాలతో ఉన్న ఆరేళ్లలోపు రవాణా వాహనాలకు రెండేళ్లపాటు పీయూసీ సర్టిఫికెట్ గడువు ఉంటుంది. ఆరేళ్లు దాటిన వాహనాలకు ఏడాదికోసారి, పదేళ్లు దాటిన వాహనాలకు ఆరు నెలలకోసారి పీయూసీ పరీక్ష చేయించుకోవాలి.

పాత వాహనాలకు యథావిధిగా పరీక్షలు:

బీఎస్-1, బీఎస్-2, బీఎస్-3 ప్రమాణాలతో ఉన్న వాహనాలకు మూడు నెలలపాటు, బీఎస్-4 వాహనాలకు ఆరు నెలలపాటు పీయూసీ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుంది. పాత వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఈ నిబంధనలను రూపొందించారు.

గడువు ముగిసిన తర్వాత కొత్త విధానం:

ఇప్పటికే పీయూసీ సర్టిఫికెట్లు పొందిన వాహనదారులకు ప్రస్తుత సర్టిఫికెట్ గడువు ముగిసే వరకు పాత నిబంధనలే వర్తిస్తాయి. ఆ తర్వాత పునరుద్ధరణ సమయంలో కొత్త నిబంధనల ప్రకారం గడువును నిర్ణయిస్తారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ముఖ్యంగా బీఎస్-6 ప్రైవేటు వాహన దారులకు సమయం, ఖర్చు ఆదా కానుంది. అయితే వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పీయూసీ సర్టిఫికెట్ గడువును గమనిస్తూ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

వచ్చే ఎన్నికల్లో పోటీచేయను



బెంగళూరు, నవంబరు 19: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేసే ప్రసక్తే లేదని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తనకు ప్రస్తుతం 80 ఏళ్లు వచ్చాయని, ఈ వయసులో ఎన్నికల బరిలోకి ఎలా దిగుతానని ఆయన ప్రశ్నించారు. మైసూర్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం మాటా ్లడుతూ భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తన నిర్ణయానికి వయసే ప్రధాన కారణమని పునరుద్ఘాటించారు. ఆయన మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అనుచరులు ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పుస్తకావిష్కరణ సభలో తనకు జరిగినట్లుగా ప్రచారంలో ఉన్న ‘సీటింగ్ అవమానం’పై సిద్ధరామయ్య స్పష్టతనిచ్చారు. పార్టీ నాయకత్వం తనను ఏమాత్రం చిన్నచూపు చూడలేదని కొట్టిపారేశారు.

దావూద్ ఇబ్రహీం భవనం కూల్చివేత



ముంబయి,నవంబరు 19: మోస్ట్ వాంటెడ్ అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ఒకప్పుడు నివసించిన ముంబై భెండి బజార్‌లోని పురాతన నివాస భవనాన్ని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూల్చివేశారు. పక్కోడియా స్ట్రీట్‌లో ఉన్న హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా భవనంలోని మిగిలిన భాగాలను బీఎంసీ సిబ్బంది భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇవాళ నేలమట్టం చేశారు. 1939లో నిర్మించిన ఈ భవనంలో దావూద్ ఇబ్రహీం భారత్ విడిచి పారిపోకముందు తన కుటుంబంతో కలిసి నివసించేవాడు. 2020 బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు, అలాగే అత్యంత ప్రమాదకరమైన కేటగిరీ శిథిల భవనంగా గుర్తించడంతో బీఎంసీ ఈ కూల్చివేత చర్యలు చేపట్టింది.

కెనడాలో భారత యువకుడు సజీవదహనం



టొరంటో,నవంబరు 19: కెనడాలో 25 ఏళ్ల భారతీయ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బ్రిటిష్ కొలంబియాలోని లాంగ్లీ ప్రాంతంలో తగలబడుతున్న కారులో అతడి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై హోమిసైడ్ విభాగం దర్యాప్తు ప్రారంభించింది. గతనెల 29వ తేదీ రాత్రి 10:30 గంటల సమయంలో రాప్లిన్సన్ క్రెసెంట్ ప్రాంతంలో ఓ వాహనం కాలిపోతోందన్న సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పిన తర్వాత వాహనం లోపల మానవ అవశేషాలను గుర్తించారు. అనంతరం మృతుడిని సర్రే నివాసి తుషార్ శర్మగా నిర్ధారించారు. ఈ ఘటనను అనుమానాస్పద హత్యగా పరిగణిస్తూ పోలీసులు విచారణ చేపట్టారు. కేసు తీవ్రత దృష్ట్యా, కెనడా ఇంటిగ్రేటెడ్ హోమిసైడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దర్యాప్తు బాధ్యతలు స్వీకరించింది.

అజిత్ దోవల్, రా మాజీ చీఫ్‌కు న్యూయార్క్ సమన్లు



న్యూయార్క్, నవంబరు 19: ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దాఖలు చేసిన సివిల్ దావాకు సంబంధించి అమెరికా ఫెడరల్ కోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ మాజీ చీఫ్ సమంత్ గోయల్‌కు ఢిల్లీలోని స్థానిక కోర్టుల ద్వారా సమన్లు అందజేయాలని న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆదేశించింది. హేగ్ కన్వెన్షన్, భారత సివిల్ ప్రొసీజర్ కోడ్ నిబంధనలను ఉటంకిస్తూ న్యాయమూర్తి కేథరిన్ పోల్క్ ఫైల్లా ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. అజిత్ దోవల్‌కు సంబంధించిన సమన్లను పాటియాలా హౌస్ జిల్లా కోర్టుకు, సమంత్ గోయల్‌కు సంబంధించిన పత్రాలను ద్వారకా, తీస్ హజారీ జిల్లా కోర్టులకు పంపాలని అమెరికా కోర్టు తన క్లర్క్‌ను ఆదేశించింది. ఈ సివిల్ కేసులో ప్రతివాదులకు సమన్లు అందేలా భారత కోర్టులు సహకరించాలని న్యాయమూర్తి కోరారు. భారత సీపీసీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన విదేశీ కోర్టుల సమన్లను స్థానిక భారతీయ న్యాయస్థానాల ద్వారా జారీ చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస

♦ మహమ్మద్ యూనస్ ఇంటికి నిప్పు
♦ అవామీ లీగ్ బంద్ పిలుపుతో ఉద్రిక్తత
♦ పలుచోట్ల బాంబు పేలుళ్లు
♦ 565 మంది అరెస్ట్



ఢాకా, నవంబరు 19: బంగ్లాదేశ్‌లో తీవ్ర హింస చెలరేగింది. నిషేధిత అవామీ లీగ్ పార్టీ (షేక్ హసీనా పార్టీ) దేశవ్యాప్త బంద్‌కు పిలుపుని వ్వడంతో ఈ దుస్థితి ఏర్పడింది. పలు ప్రాం తాల్లో చోటుచేసుకున్న ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రాజధాని ఢాకాలో వరుసగా బాంబు పేలుళ్లు కలకలం రేపాయి. ఇదే సమయంలో చట్టోగ్రామ్‌లోని మాజీ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ పూర్వీకుల ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులునిప్పుపెట్టారు. అలాగే పలు ప్రాంతాల్లోని గ్రామీణ్ బ్యాంక్ శాఖలపై కూడా దాడులు జరిగాయి. పశ్చిమ నరైల్ జిల్లా లో అవామీ లీగ్ శ్రేణులు జరిపిన దాడిలో అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి)కి చెందిన ఇద్దరు నేతలు మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. దేశంలోని దాదాపు 28 జిల్లాల్లో దజన్ల కొద్దీ నాటుబాంబుల పేలుళ్లు, వాహనాల దహనం వంటి ఘటనలు చోటుచేసు కున్నాయి.

పోలీసుల విస్తృతంగా తనిఖీలు

ఈ హింసాత్మక పరిణామాల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాజ ధాని ఢాకాలో గత 24 గంటల్లో మాజీ విద్యా శాఖ మంత్రి నూరుల్ ఇస్లాం నహీద్‌తో సహా మ

ఫ్యాన్సీ నంబర్ల బిడ్డింగ్ 30 రోజులకు కుదింపు
కీలక మార్పు చేసిన రవాణా శాఖ

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త:వాహనాలకు ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్లు పొందాలనుకునే యజమానులకు తెలంగాణ రవాణా శాఖ కీలక మార్పు చేసింది. ఇప్పటివరకు ఫ్యాన్సీ నంబర్ల కోసం ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు కుదించింది. ఈ కొత్త నిబంధన గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. ఈ మేరకు దీనికి సంబంధించి రవాణా కమిషనర్ ఇలంబర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాన్సీ నంబర్ కావాలనుకునే వాహనదారులు తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) జారీ అయిన తేదీ నుంచి 30 రోజుల్లోపు రిజర్వేషన్, బిడ్డింగ్, రుసుము చెల్లింపు ప్రక్రియలన్నింటినీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒకవేళ ఈ గడువు దాటితే, ఆ వాహనానికి ఆటోమేటిక్గా సాధారణ (ర్యాండమ్) నంబర్ కేటాయిస్తారన్నారు. వాహన విక్రయ సమయంలోనే ఈ నిబంధన గురించి కొనుగోలుదారులకు స్పష్టంగా తెలియజేయాలని డీలర్లకు రవాణా శాఖ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. మరిన్ని వివరాలకు సమీపంలోని ఆర్టీఏ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

సిఎంగారూ..హరీశ్‌రావు అవినీతిపై చర్యలు ఎప్పుడు?
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత
సిఎంఒకు అందజేసిన ఫిర్యాదు పత్రాలు ఎక్స్‌లో పోస్ట్

హైదరాబాద్, నవంబర్ 19,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన వేళ గురువారం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఒ) తాను అందజేసిన ఫిర్యాదు పత్రాలను ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారు సీఎం గారూ?' అంటూ కవిత నేరుగా రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 14న సీఎంఒకు సమర్పించిన ఈ లేఖలను అధికారులు నవంబర్ 18న స్వీకరించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం, డిజైన్ మార్పులు, పంప్ హౌస్ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు జరిగాయని ఆమె ఆరోపించారు. "సిద్ధిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో జరిగిన అవినీతి, డిజైన్ మార్పు, నాణ్యతా లోపాలు జరిగినట్లుగా మా దృష్టికి వచ్చిన అంశాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వరకు నీటిని తరలించే కాలువ డిజైన్లో మార్పులు,

పంప్ హౌస్ నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ చేపట్టిన విచారణకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం అని కవిత తన ఫిర్యాదులో స్పష్టం చేశారు.

జగన్ అక్రమాస్తుల కేసు స్టేటస్ రిపోర్టుకు తెలంగాణ హైకోర్టు ఆదేశం
మూడువారాల గడువు కోరిన ప్రభుత్వం తరుపు న్యాయవాదులు
30వ తేదీకి తదుపరి విచారణకు వాయిదా

హైదరాబాద్, నవంబరు 19,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేసుల ప్రస్తుత పరిస్థితిపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను నవంబరు 30కి వాయిదా వేసింది. జగన్ అక్రమాస్తుల కేసులను త్వరగా తేల్చాలని ఇడి, హరిరామ జోగయ్య తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా గురువారం జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి హైకోర్టులో విచారణ జరిగింది. జగన్ కేసుల స్టేటస్ రిపోర్టు సమర్పించడానికి 3 వారాల గడువు కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోరగా తెలంగాణ హైకోర్టు సమ్మతించింది. జగన్ అక్రమాస్తులపై సిబిఐ 11, ఇడి 9 అభియోగపత్రాలు ఇప్పటివరకు దాఖలు చేశాయి. ఇడితరఫున న్యాయవాది వాదిస్తూ 15 ఏళ్లుగా విచారణ కొనసాగుతోందని పలు కేసుల్లో 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. డిశ్చార్జ్ పిటిషన్లపై సిబిఐ కోర్టులో విచారణ జరుగుతోందని కోర్టు దృష్టికి ఇడి న్యాయవాది తీసుకెళ్లారు. డిశ్చార్జ్ పిటిషన్లు పెండింగ్లో ఉండటంతో కేసుల విచారణ ప్రాథమిక దశలోనే నిలిచిపోయిందని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ వాదనలు వినిపించింది. కేసులను రోజువారీ విచారణను చేపట్టాలని కోరింది. నిందితులు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఈడీ కోరింది. కేసులను రోజువారీగా విచారించాలని హరిరామ జోగయ్య తరఫు న్యాయవాది కోరారు. 2024లోనే రోజువారీ విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పురోగతి లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రత్యేక కోర్టు ప్రిసైడింగ్ జడ్జిని ప్రతివాదిగా ఈడీ చేర్చడంపై హైకోర్టు ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్,నవంబరు 19,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహ దారుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షి ం చేందుకు ఒకరోజు పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు హెచ్ఐసీసీ నోవోటెల్‌లో మర్యాద ‌పూర్వకంగా



ఆర్టీసి బలోపేతం దిశగా చర్యలు : రవాణా మంత్రి
ప్రభాకర్‌తో ఆ సంస్థ ఎండి డాక్టర్ అనిల్ భేటీ

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త ఆర్టీసీ బలోపేతం దిశగా చర్యలు చేపట్టనున్నట్లు ఆసంస్థ నూతన ఎండి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. బస్సుల ఓఆర్ పెంపుపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ గురువారం ఆయన రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సంస్థ పనితీరు, బలోపేతం, కార్మికుల సంక్షేమం, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర వివిధ అంశాలపై చర్చకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్షి ‌మ్మ ఉచిత బస్సు ప్రయాణ పథకం తీరుతెన్నులు, మహిళా ప్రయాణికుల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసుల నిర్వహణపై ఇరువురు సమగ్రంగా సమీక్షి ంచారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ నగరంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచడం, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నూతన బస్సుల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంపై అభిప్రాయాలను పంచుకున్నారు.

సిద్దిపేటలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగంలో ప్రజల అజెండా లేదు: హరీశ్‌రావు విమర్శలు



హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త: సిద్దిపేటలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చిల్లర ప్రసంగం చేశారంటూ మాజీ మంత్రి బిఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. గంట పైగా సాగిన సీఎం చెత్త ప్రసంగంలో ప్రగల్భాలు తప్ప, ప్రజలు లేరు, ప్రజల ఎజెండా లేదు. ఊకదంపుడు తప్ప, కరువు కోరల్లో నలుగుతున్న రైతుకు ఊరటలేదు అని పేర్కొన్నారు. సిద్దిపేటకు నిలిపేసిన రూ. 1070 కోట్ల పెండింగ్ పనుల ప్రస్తావనే లేదని, చెల్లని రూపాయికి గీతలు ఎక్కువ అన్నట్టుగా ఉందన్నారు. తాడి చెట్టు, గడ్డం అంటూ అడ్డగోలుగా బాడీ షేమింగ్ తప్ప, అక్కరకు వచ్చే ముచ్చట ఒక్కటీ లేదన్నారు. మాటల్లో వజన్ లేదు.. చేతల్లో విజన్ లేదన్నారు. భూమిలో బలంగా వేర్లు ఉండటం వల్లనే తాడి చెట్టు సమున్నతంగా ఎదుగుతుందని, ఈదురు గాలులు వచ్చినా, తుఫాన్లు వచ్చినా ఉక్కుగా నిలబడుతుందన్నారు. గౌడన్నల కల్ప తరువు తాడి చెట్టును పదే పదే తూలనాడినందుకు సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జిన్నా వచ్చి గాంధీ దేశభక్తి గురించి ప్రశ్నించడం..పార్టీ మారడం మీద నువ్వు నన్ను ఒట్టేయమని అడగడం రెండూ ఒకటేనని పేర్కొన్నారు.

పార్టీ మోర్చాల మధ్య సమమన్వయం మరింత పెంపు
బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సంస్థాగత సమావేశం

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త:హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సంస్థాగత సమావేశం జరిగింది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన, రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి ఆశిష్ షెలార్ సమక్షంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు వివిధ మోర్చాల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పార్టీ నాయకత్వానికి, వివిధ మోర్చాలకు మధ్య సమన్వయాన్ని మరింత పెంచడంపై నాయకులు చర్చించారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల కార్యక్రమాల్లో అన్ని మోర్చాలు చురుగ్గా పాల్గొనేలా చూడటంపై దృష్టి సారించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. రాబోయే ఎన్నికలకు సమన్వయంతో సిద్ధమవ్వడంతో పాటు, తెలంగాణవ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేలా దిశానిర్దేశం చేశారు.



ఫించన్లు అందిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దానం నాగేందర్ తదితరులు

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 4.68 లక్షల చేయూత పింఛన్లు మంజూరు
ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,094 మందికి పింఛన్ పత్రాల పంపిణీ
బంజారాభవన్‌లో సీతక్కతో కలిసి పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

జూబ్లీహిల్స్, నవంబరు 19, ప్రభాతవార్త: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష ్యమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4.68 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను సహచర మంత్రి సీతక్కతో కలిసి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్నామని, గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే తమ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అర్హులకు కేటాయిస్తున్నామని, మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్పటివరకు రూ.79 వేల కోట్ల రుణాలు అందించామని, వాటి వడ్డీలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. బస్తీ దవాఖానాలను ఉపయోగపడేలా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,094 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలు అందజేశారు. వీరిలో వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, దివ్యాంగులు, ఫైలేరియా బాధితులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, కాంగ్రెస్ నాయకులు రాములు చౌహాన్, మామిడి నర్సింగ్‌రావు, దేశం శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శాసనసభ్యుడు రాజగోపాల్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిజం: ఎమ్మెల్యే టి.రాజాసింగ్

గోషామహల్,నవంబర్19ప్రభాతవార్త:తెలంగాణ ప్రభుత్వంపై మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిజాలు చెప్పడానికి ప్రయత్నించినట్లు గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా సోషల్ మీడియాలో రాజాసింగ్ చేసిన ఆరోపణలు వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నట్లు తెలంగాణ గుండాల రాజ్యం, అవినీతి రాజ్యం నడుస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు ఎప్పుడు అడిగినా లేదని సమాధానం చెప్పలేదన్నారు. గత ముఖ్యమంత్రి ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చెందాలని పని చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఆయనతో మంచిగా ఉన్న ఎమ్మెల్యేలకే నిధులు ఇస్తున్నారన్నారు. బంగారు తెలంగాణ కావాలంటే ప్రతి ఒక్క నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలని, ఎమ్మెల్యేలు ఫోన్ చేసినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇది మంచి పద్ధతి కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.

అంగన్వాడీలో ప్రారంభమైన తొలి ముద్ద
మరో ఏడు జిల్లాల్లో విస్తరించిన పౌష్టికాహార పథకం

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల కోసం ప్రవేశపెట్టిన తొలి ముద్ద అల్పాహార పథకం అమలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని మరో ఏడు జిల్లాల్లో గురువారం నుండి అమలు చేయడం ప్రారంభించింది. రాష్ట్రంలోని భూపాలపల్లి, జనగామ, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, మాన్యకొండ, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో గురువారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కావడం ద్వారా చిన్నపిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందించే దిశగా అడుగులు పడ్డాయి. ఈ ఏడు జిల్లాల్లో కొత్తగా 43,657 మంది చిన్నారులకు ప్రతి రోజూ ఉదయం బలవర్ధకమైన అల్పాహారం అందుతుంది. ఇప్పటికే తెలంగాణలోకి ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లోని 8,694 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ తొలి ముద్ద పథకం విజయవంతంగా అమలవుతోంది. తాజాగా ఇప్పుడు ప్రారంభించిన ఏడు జిల్లాల్లో కలిపి సుమారుగా 91,796మంది చిన్నారులకు అల్పాహారం అందిస్తున్నారు. ఈ విస్తరణతో కలిపి మొత్తం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 1,35,453 మంది చిన్నారులకు ఈ తొలి ముద్ద అందుతుంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రంలోని మిగిలిన 19 జిల్లాల్లోనూ అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మహిళా, శిశుసంక్షేమశాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో మేలైన పశుజాతి పెంపకంపై దృష్టి
100 ఎకరాల్లో పరిశోధన సంస్థ, వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీ

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త: మేలైన పశుజాతి సంరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గుర్తింపుపొందిన తూర్పు పొడజాతి ఎడ్లు, ఆవుల సంతతి సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం వారం రోజుల్లో కీలక నిర్ణయం తీసుకోనుంది. ఈ పశుజాతి సంతతిని పెంపొందించి, వాటిని పరిరక్షి ంచేందుకుగాను ఒక ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. ఇందుకుగాను రాష్ట్రంలోని నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. దీని నిమిత్తం ఆ మండలం పరిధిలో దాదాపు వంద ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఇందులో పశుజాతి పరిశోధనా సంస్థ, వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి వచ్చే వారం నల్లమల పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ జాతి ఎడ్లను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గిత్తగా ప్రకటించడంతో సంరక్షణ కోసం పశుసంవర్ధక శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కాగా ప్రతికూల వాతావరణాన్ని తట్టుకొనగలగడం తూర్పు పొడ జాతి ఎడ్లు, ఆవుల ప్రత్యేకతగా అధికారులు చెబుతున్నారు. మారనున్న వాతావరణ పరిస్థితులను పసిగట్టి తమ కదలికల ద్వారా రైతులకు ఈ జాతి పశువులు సంకేతికాలను సైతం ఇస్తాయి. అలాగే వర్షం పడే సూచనలు ఉంటే పొలం పనులు ఆపేసి ఇంటివైపు వెళ్లాలన్నట్లుగా సూచనలు కూడా ఇస్తాయి. కొండలు, కోనలు, నల్లమలలో లభించే గడ్డిని మేస్తూనే తమకు అవసరమైన పోషక గుణాలు కలిగిన మొక్కలను ఎంచుకొని తినడం వీటికున్న మరో ప్రత్యేకత.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త:నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఇంజనీర్లకు తెలంగాణ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ నీటి మళ్లింపు వ్యవహారంపై ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలపై ఈ నోటీసులు ఇచ్చింది. నాగార్జునసాగర్ వద్ద ఏపీ చేపడుతున్న సుమారు రూ.1,200 కోట్ల విలువైన అమరజీవి జలపథం ప్రాజెక్టు పనుల గురించి ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఇవ్వలేదన్న కారణంతో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిప్యూటీ ఈఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)లకు ఈ నోటీసులు అందాయి.ఈ పనుల పురోగతి ఏమిటో, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో ఎందుకు విఫలమయ్యారో వివరిస్తూ 7 రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఇంజనీర్లను ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా లిఫ్ట్ ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు ఎస్ఈకు తెలిసినా, పైస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈ నలుగురి నిరక్ష ్యం వల్లే ప్రభుత్వం బద్నాం అయిందని భావించిన ప్రభుత్వం వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. వారు నోటీసులకు వివరణ ఇచ్చిన తర్వాతే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.అయితే, దీనిపై నోటీసులు అందుకున్న అధికారులు తమపై ప్రభుత్వం చర్యలు చేపడితే వీఆర్ఎస్ తీసుకోవడానికి సైతం వెనుకాడబోమని తోటి అధికారులతో పేర్కొంటున్నట్లు తెలిసింది. పల్నాడు జిల్లాలో తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువ వైపు నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేపట్టినట్లు చెబుతున్న ప్రాజెక్టుపై రాజకీయంగా విమర్శలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రాజెక్టు పనులను 2026 మార్చిలో ప్రారంభించింది.

ఆద్య కళా క్షేత్రానికి నీలమ్మ పేరు పెట్టాలి
ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు
సతీమణి నీలమ్మ సంస్మరణ సభ

చిక్కడపల్లి , నవంబరు 19 (ప్రభాతవార్త) : ఆద్య కళా క్షేత్రానికి నీలమ్మ పేరు పెట్టడంతో పాటు ఐదు ఎకరాల భూమి కేటాయించాలని వక్తలు కోరారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సతీమణి నీలమ్మ సంస్మరణ సభ గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి ముద్రణ ప్రచురించిన కలల కాపరి నీలమ్మ స్మారక పుస్తకాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. నీలమ్మ గొప్ప మానవతావాదని, ఆమె సేకరించిన అమూల్యమైన కళా సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యతని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ ఆద్య కళా క్షేత్రానికి నీలమ్మ పేరు పెట్టాలని కోరారు. సామాజిక ఉద్యమనేత పృథ్వీరాజు ఐదు ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. కళ్లు, దేహాన్ని దానం చేసిన నీలమ్మ సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ఎమ్మెల్సీ కోదండరాం, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు, సీనియర్ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, కె. శ్రీనివాస్, రచయిత ఏకే ప్రభాకర్, వివిధ సంఘాల ప్రతినిధులు, నీలమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సతీమణి నీలమ్మ సంస్మరణ సభలో పాల్గొన్న సుప్రీమ్ కోర్ట్ పూర్వ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

ఎపి డిసిఎం పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద వ్యక్తి హల్‌చల్.. ఆత్మహత్యాయత్నం
- బౌన్సర్లు అడ్డుకోవడంతో వారిపై దాడి - కత్తితో చేతులపై గాయాలు

జూబ్లీహిల్స్, నవంబరు 19, ప్రభాతవార్త: ఏపి డిసిఎం, జనసేన అధినేత, నటుడు పవన్‌కల్యాణ్ నివాసం వద్ద ఓ వ్యక్తి హల్‌చల్ చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్‌లో కలకలం రేపింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన భట్టు సుచేతన్ ఠాకూర్ నాయక్ అనే వ్యక్తి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 35లోని పవన్‌కల్యాణ్ నివాసానికి చేరుకున్నాడు. అప్పటికే అతను ఖమ్మం నుంచి మంగళగిరికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు దాదాపు 15 రోజులకుపైగా ప్రయాణించి జూబ్లీహిల్స్‌కు చేరుకున్నాడు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌ను కలిసి తన అప్పులు తీర్చేందుకు ఆర్థిక సాయం చేయాలని కోరుతూ, పవన్‌కల్యాణ్‌ను కలవాలనే ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ నివాసం సమీపంలో ఒక ప్లెక్సీని ఏర్పాటుచేశాడు. పవన్‌కళ్యాణ్ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా గమనించిన బౌన్సర్ రామ్‌శెట్టి రాజీవ్‌కుమార్ అతడిని లోపలికి అనుమతించకపోవడంతో సుచేతన్ అడ్డుతగిలి దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న కత్తితో ఛాతీ, చేతులపై గాయాలు చేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అంతేకాకుండా బౌన్సర్లను కూడా బెదిరించి దాడికి యత్నించాడు. దీంతో అప్రమత్తమైన బౌన్సర్లు అతడిని అడ్డుకుని కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై బౌన్సర్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వన్ హెల్త్‌తోనే ఆరోగ్యకరమైన సమాజం
- ఎపిహెచ్‌వి 17వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

అత్తాపూర్ నవంబరు 19,ప్రభాతవార్త : మనుషులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉన్నాయని, అంటువ్యాధుల నియంత్రణకు సమన్వయంతో కూడిన వన్ హెల్త్ విధానం ఎంతో అవసరమని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డార



ఎన్నికలుండవు.. విప్లవం ఖాయం

అజంఖాన్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 19: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీనియర్ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి అజంఖాన్ జైలు నుంచి విడుదలయ్యారు. ఘజియాబాద్‌లోని దాస్నా జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన రాంపూర్‌కు చేరుకోగా, మద్దతుదారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఇకపై ఎన్నికలు ఉండవని, విప్లవం, మార్పుల పవనం వీస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, అజం ఖాన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

2027 ఎన్నికలకు ముందు కీలక పరిణామం

2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అజం ఖాన్ విడుదల కావడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. న్యాయపరమైన చిక్కులతో జైలులో ఉన్న ఆయనకు తాజాగా బెయిల్ లభించింది.ప్రస్తుతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఉన్నప్పటికీ, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఆయన తిరిగి రాజకీయంగా చురుకుగా మారితే ఎస్పీకి ఎంతవరకు ప్రయోజనం కలుగుతుంది? ముస్లిం ఓటర్లపై పార్టీ పట్టు మరింత బలపడుతుందా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

జనాభాలో అగ్రస్థానానికి ఇస్లాం!

న్యూఢిల్లీ, నవంబరు 19: ప్రపంచ జనాభా ముఖచిత్రంలో రాబోయే రోజుల్లో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. క్రైస్తవ మతాన్ని వెనక్కి నెట్టి 2035 నాటికి ఇస్లాం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మతంగా అవతరించనుందని ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదిక వెల్లడించింది. రెండు మతాల్లోనూ జనాభా వృద్ధి ఉన్నప్పటికీ, ముస్లింల సంఖ్య అనూహ్య వేగంతో పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. ఈ జనాభా మార్పునకు మత మార్పిడులు కారణం కాదని, సంతానోత్పత్తి రేటు (ఫెర్టిలిటీ రేటు) ఎక్కువగా ఉండటమే కీలకమని ప్యూ సీనియర్ డెమోగ్రాఫర్ కాన్రాడ్ హ్యాకెట్ తెలిపారు. 2020-25 మధ్య కాలంలో ముస్లిం మహిళల్లో సగటున 3.1 సంతానోత్పత్తి రేటు నమోదు కాగా, క్రైస్తవ మహిళల్లో ఇది 2.5గా ఉంది. ఇతర మతాల మహిళల్లో ఈ రేటు కేవలం 1.6 శాతంగా మాత్రమే నమోదైంది. 2020 నాటికి ప్రపంచవ్యాప్తంగా 2.27 బిలియన్ల క్రైస్తవులు, 2.02 బిలియన్ల ముస్లింలు ఉండగా 2035 నాటికి ముస్లింల జనాభా 2.57 బిలియన్లకు, క్రైస్తవుల సంఖ్య 2.52 బిలియన్లకు చేరుకుంటుందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

పుతిన్ వెంట చెగెట్ బ్రీఫ్‌కేస్



షెన్‌జెన్, నవంబరు 19: ప్రపంచ దేశాల అధినేతలంతా ఒకే వేదికపైకి వస్తున్న వేళ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెంట కనిపించిన ఓ నల్లటి బ్రీఫ్‌కేస్ ఇప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. చైనాలోని షెన్‌జెన్‌లో జరుగుతున్న ఏపెక్ సదస్సుకు హాజరైన పుతిన్ వెంట రష్యా నావికాదళ అధికారులు ఈ ప్రత్యేకమైన బ్రీఫ్‌కేస్‌ను తీసుకెళ్లడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది సాధారణ బ్యాగ్ కాదని, రష్యా అణ్వాయుధాల కమాండ్ వ్యవస్థలో కీలకమైన చెగెట్ న్యూక్లియర్ బ్రీఫ్‌కేస్ అని రష్యా అధికారి ధృవీకరించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో పుతిన్ సమావేశం కానున్న సమయంలో ఈ బ్రీఫ్‌కేస్ కనిపించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. పుతిన్ వెంట కనిపించిన ఈ బ్రీఫ్‌కేసు చెగెట్ అని పిలుస్తారు. ఇది రష్యా అణు కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలో భాగం. దేశ అధ్యక్షుడికి అత్యంత కీలకమైన సైనిక నాయకత్వంతో సురక్షితంగా సంప్రదింపులు జరిపేందుకు, అణ్వాయుధాల వినియోగానికి సంబంధించిన అధికారిక ఆదేశాలను పంపేందుకు ఇది ఉపయోగపడుతుంది.

చెన్నైలో భారీగా హెరాయిన్ పట్టివేత

చెన్నై, నవంబరు 19: డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు చెన్నైలో ఆకస్మికంగా దాడులు నిర్వహించి, 70 కిలోలకు పైగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ సుమారు రూ.700 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసులో తమిళనాడులోని దక్షిణ జిల్లాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేశారు. ఐస్‌క్రీం ప్యాకెట్ల ముసుగులో భారీ మొత్తంలో హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం డీఆర్ఐ అధికారులకు అందింది. మాధవరం ప్రాంతంలోని ఓ ఐస్ తయారీ కేంద్రంపై అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. తయారైన ఐస్‌ను లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని తనిఖీ చేయగా, వాహనంలోని రిఫ్రిజిరేషన్ యూనిట్‌లో దాచిన హెరాయిన్ ప్యాకెట్లు బయటపడ్డాయి. వాహనంలో వేచి ఉన్న ఇద్దరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని అబ్దుల్ షుకూర్, షఫీక్ అహ్మద్‌గా గుర్తించారు.

తమిళనాడులో పెట్టుబడుల డేటా లీక్

15 మంది సీనియర్ అధికారులపై సీఎం విజయ్ వేటు

చెన్నై,నవంబరు 19: తమిళనాడు ప్రభుత్వంలో పెట్టుబడుల డేటా లీక్ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులకు సంబంధించిన అత్యంత గోప్యమైన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చేరవేశారన్న ఆరోపణలతో సీఎం విజయ్ ప్రభుత్వం 15 మంది సీనియర్ అధికారులను తొలగించింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ గైడెన్స్ తమిళనాడులో పనిచేస్తున్న ఈ అధికారులపై అంతర్గత దర్యాప్తు అనంతరం వేటు వేసినట్లు సమాచారం. తమిళనాడులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన ప్రముఖ సంస్థలతో ప్రభుత్వం జరిపిన చర్చలు, ఒప్పందాలు, రాయితీలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు చేరవేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. తొలగించినవారిలో ఎక్కువ మంది 2016-2021 మధ్య అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారు. డీఎంకే ప్రభుత్వం కూడా వీరి సేవలను వినియోగించుకుంది. తొలగించిన అధికారుల్లో ముగ్గురు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో చేరుతుండటం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. తమిళనాడుకు రావాల్సిన కొన్ని ప్రాజెక్టులు ఏపీకి మళ్లడానికి ఈ లీకేజీలే కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఎలాంటి సమాచారం బయటకు వెళ్లిందనే దానిపై ప్రభుత్వం ఇప్పటివరకు అధికారిక ఆధారాలను బయటపెట్టలేదు.

నగదు బదిలీతో రాష్ట్రాలపై పెనుభారం

సంక్షేమ పథకాల ఖర్చుపై 16వ ఆర్థిక సంఘం ఆందోళన

సంక్షేమ పథకాల వ్యయంలో తెలంగాణ, ఏపీ ముందంజ

హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త : ఈ ఆర్థిక ఏడాదిలో నగదు బదిలీ పథకాల కోసం రెవెన్యూ వ్యయంలో అత్యధిక వాటా కేటాయించిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలిచాయి. తెలంగాణ రెండో స్థానంలో, ఆంధ్రా నాలుగో స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు ఈ తరహా పథకాల కోసం సుమారు రూ.4 లక్షల కోట్లు కేటాయించాయి. నగదు బదిలీలపై పెరుగుతున్న వ్యయం ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితిపై భారంగా మారుతోందని 16వ ఆర్థిక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రాలు తమ రెవెన్యూ వ్యయంలో నగదు బదిలీ పథకాలకోసం కేటాయించిన నిధుల వాటా ఆధారంగా రూపొందించిన నివేదికలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 15 శాతం కేటాయింపులతో జార్ఖండ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా, 14 శాతంతో తెలం గాణ, పశ్చిమ బెంగాల్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక 13 శాతం కేటాయింపులతో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 128 నగదు బదిలీ పథకాల కోసం రూ.32,629 కోట్లు కేటాయించింది. ఈ మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 14 శాతానికి సమానం. ఈ కేటాయింపుల్లో రైతుల కోసం రూ.18 వేల కోట్లు, సామాజిక భద్రతా పింఛన్ల కోసం రూ.14,629 కోట్లు ఉన్నాయి. మరోవైపు ఆంధ్రా ప్రభుత్వం ఇదే తరహా పథకాల కోసం రూ.33,943 కోట్లు కేటాయించింది. ఇది ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 13 శాతంగా ఉంది. ఇందులో సామాజిక భద్రతా పింఛన్లకు రూ.27,343 కోట్లు.. రైతులకు ఆర్థిక సాయం అందించే పథకాల కోసం రూ.6,600 కోట్లు కేటాయించారు. ఇక నగదు బదిలీ పథకాల కోసం అత్యధికంగా పశ్చిమ బెంగాల్ రూ.47,542 కోట్లు కేటాయించింది. ఆ



తర్వాత కర్ణాటక రూ.40,392 కోట్లు, మహారాష్ట్ర రూ.38,549 కోట్లతో ఉన్నాయి. మధ్యప్రదేశ్ రూ.32,059 కోట్లు, తమిళనాడు రూ.19,036 కోట్లు కేటాయించాయి. రెవెన్యూ వ్యయంలో నగదు బదిలీ పథకాలకు కేటాయించిన వాటా రాష్ట్రాలవారీగా చూస్తే జార్ఖండ్ 15 శాతం, తెలంగాణ 14 శాతం, పశ్చిమ బెంగాల్ 14 శాతం, ఆంధ్రప్రదేశ్ 13 శాతం, కర్ణాటక 12 శాతం, మధ్యప్రదేశ్ 10 శాతం, మహారాష్ట్ర 6 శాతంగా ఉన్నాయి. ఈ నగదు బదిలీ పథకాల పరిధిలో మహిళలు, రైతులు, యువతతోపాటు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే సామాజిక భద్రతా పింఛన్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఈ తరహా పథకాల కోసం రాష్ట్రాలు కలిపి సుమారు రూ.4 లక్షల కోట్లు కేటాయించడం గమనార్హం. ఇది దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు ఒక శాతానికి సమానం. 2022-23లో ఈ పథకాల కేటాయింపులు జీడీపీలో 0.6 శాతంగా ఉండగా, 2026-27 నాటికి ఒక శాతానికి చేరడం గమనార్హం. మొత్తం కేటాయింపుల్లో దాదాపు 90 శాతం మహిళలకు అందించే ఆర్థిక సాయం, సామాజిక భద్రతా పింఛన్లకే వెళ్తున్నాయి. మహిళలకు ఇచ్చే సాయంలో ఎక్కువ భాగం నెలవారీగా చెల్లించేలా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. రైతులకు ఇచ్చే సాయం, ఇతర పథకాల మొత్తాలను మాత్రం ఏడాదిలో రెండు లేదా మూడు విడతలుగా అందించే విధానాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు, నగదు బదిలీలపై చేస్తున్న ఖర్చు క్రమంగా పెరుగుతోందని ఈ రిపోర్ట్ వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ భాగాన్ని మినహాయించి చూస్తే 2018-19లో రాష్ట్రాల రెవెన్యూ రాబడుల్లో సబ్సిడీలు, నగదు బదిలీల వాటా 16 శాతంగా ఉండేది. 2023-24 నాటికి అది 21 శాతానికి పెరిగింది. ఈ కాలంలో నగదు బదిలీల వ్యయం ఏటా సగటున 24 శాతం వృద్ధి చెందింది. ఇదే సమయంలో సబ్సిడీల ఖర్చు వృద్ధి 12 శాతంగా నమోదైంది. అంటే సబ్సిడీలతో పోలిస్తే నగదు బదిలీలపై ప్రభుత్వాల వ్యయం రెండింతల వేగంతో పెరిగిందని నివేదిక విశ్లేషించింది. నగదు బదిలీ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా ఆర్థిక సాయం అందుతున్నప్పటికీ వాటి అమలులో రాష్ట్రాలకు ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయని 16వ ఆర్థిక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం



ఎన్ఐఏ రూపొందించిన సావనీర్ ను ఆవిష్కరిస్తున్న అమిత్‌షా, సంజయ్ తదితరులు

న్యూఢిల్లీ, నవంబరు 19: ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా సమస్యలను పూర్తిగా నిర్మూలించాలంటే విదేశాల్లో తలదాచుకుంటున్న నేరస్థులను భారత్‌కు తిరిగి రప్పించాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. న్యూఢిల్లీలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన రెండురోజుల ఉగ్రవాద వ్యతిరేక సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. భారత సరిహద్దులు దాటి కార్యకలాపాలు సాగిస్తున్న నేర ముఠాలపై సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా విదేశాల్లో తలదాచుకుంటున్న నేరస్థులను గుర్తించి, వారిని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణామధ్య ఉన్న సంబంధాలను తెంచివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. విదేశాల్లో ఉంటున్న నేరస్థులు అక్కడి నుంచే నేర కార్యకలాపాలను సమన్వయం చేయడం, సరిహద్దుల గుండా అక్రమ రవాణాకు సహకరించడం, భారత్‌లోని తమ అనుచరులతో సంబంధాలు కొనసాగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇలాంటి నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు అంతర్జాతీయ సహకారం, నేరస్థుల అప్పగింత ఒప్పందాలు కీలకమని వివరించారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయడాన్ని దేశవ్యాప్తంగా పోలీసు బలగాలు సమన్వయంతో చేపట్టిన చర్యలకు ముఖ్యమైన ఉదాహరణగా అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం ఉంటేనే రాష్ట్రాల సరిహద్దులు దాటి పనిచేస్తున్న నేర ముఠాలను సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలు, ఉగ్రవాదా నికి ఆర్థిక సహకారం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే ఆరోపణల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం 2022 సెప్టెంబర్‌లో చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం యూఏపీఏ కింద పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలపై ఐదేళ్లపాటు నిషేధం విధించింది.

వ్యాధులను తక్షణమే గుర్తించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్(బేగంపేట), నవంబరు 19 ,ప్రభాతవార్త : అంటు వ్యాధులను తక్షణమే గుర్తించి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.గురువారం ప్యాట్నీ సెంటర్ లోని ఎన్టీపీసీ భవనంలో ఏర్పాటు చేసిన మెట్రో పాలిటన్ సర్వైవ్లీన్స్ యూనిట్ (ఎంఎస్ఈ యూ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ వల్ల వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, అంటు వ్యాధులను ముందస్తుగా గుర్తించి నియంత్రించేందుకు దోహదపడుతుందని అన్నారు. దీన్ని ఉపయో గించుకుని అధికార యంత్రాంగం సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ఈ యూనిట్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు క్షేత్రస్థాయి వైద్య బృందాల నుంచి ఆరోగ్య సమాచారాన్ని సేకరించి పర్యవేక్షిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐడీఎస్పీ, ఎసీడీసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శుభాంగి కుల్సంగే. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమర్ సింగ్ నాయక్, జోనల్ కమిషనర్ సంతోష్ బడావత్, అదనపు కమిషనర్ రవికి రణ్, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్టు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ శిల్పారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల రికార్డు!



- నవంబరులో రికార్డు స్థాయిలో హాజరు
- పనులకు రోజుకు సగటున 6 లక్షల మంది
- ప్రగతి పనులు వెల్లడించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల పరిధిలోని వివిధ కార్యక్రమాల పురోగతిపై మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, జలసిరి, గ్రామీణ మోలిక వసతుల కల్పన, పాంశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పనుల అమలులో రాష్ట్రంలో కూలీల హాజరు గణనీయంగా పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. నవంబర్ నెలలో రోజువారీ సగటు కూలీ హాజరు 5.97 లక్షలకు చేరిందని అధికారులు వివరించారు. ఈనెల 18న ఒక్కరోజే 6 లక్షలకు పైగా కూలీలు పనులకు హాజరయ్యారు. నవంబర్ సీజన్‌లో ఇది ఇప్పటవరకు అత్యధికం. బుధవారం ఆరు లక్షలకు మించి కూలీలకు ఉపాధి కల్పించిన నేపథ్యంలో ఇదే ఒరవడిని కొనసాగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రోజుకు ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి సగటున 47 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని, ఆ సంఖ్యను 60 పెంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఉపాధి కోరే ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని మంత్రి సూచించారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న మేట్లకు డిసెంబర్ 1వ తేదీ నుంచి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.ఏజెన్సీలో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని మంత్రి సూచించారు. అటవీశాఖతో సమన్వయం చేసుకుంటూ అటవీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, ఊట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ పనుల ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించడంతోపాటు వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం లక్ష్యంగా పనిచేయాలన్నారు.జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన పనులపై మంత్రి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 88,675 పనులు ప్రారంభమయ్యాయని, 28,646 పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఇందులో 6,755 పంటకుంటలు పూర్తయ్యాయి.

నెట్ పరీక్షలకు కొత్త తేదీలు

న్యూఢిల్లీ,నవంబరు 19: దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదురుచూస్తున్న యూజీసీ నెట్ జూన్ 2024, జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ (సిఎస్ఐఆర్ యజిసి నెట్), ఎన్‌సీఈటీ (ఎన్‌సిఇటి) 2024 పరీక్షలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) కొత్త తేదీలను ప్రకటించింది.ఎన్‌టీఏ విడుదల చేసిన ప్రకటన ప్రకారం యూజీసీ నెట్ జూన్ 2024 పరీక్షలు ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించనున్నారు. జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షలు జూలై 25 నుంచి 27 వరకు, నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఎన్‌సెట్ జూలై 10న నిర్వహించనున్నారు.ఆన్‌లైన్ విధానంలో పరీక్షలుఈసారి యూజీసీ నెట్ సహా సంబంధిత పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించనున్నారు. గతంలో యూజీసీ నెట్ జూన్ 2024 పరీక్షను పెన్ అండ్ పేపర్ (ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించినప్పటికీ, తాజాగా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని నిర్ణయించారు.ఇక ఆల్ ఇండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 పరీక్షను ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జూలై 6, 2024న నిర్వహించనున్నారు.అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలుపరీక్షలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్ ఎన్టీయే డాట్ ఎసి డాట్ ఇన్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే అభ్యర్థులు 011-40759000 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. ఈమెయిల్ చిరునామాల ద్వారా సంప్రదించవచ్చు. అనివార్య కారణాలతో పరీక్షలు వాయిదాకొన్ని అనివార్య కారణాల వల్ల ఈ పరీక్షలను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం జరిగినట్లు ఎన్‌టీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. జూన్ 18న దేశవ్యాప్తంగా పలు నగరాల్లో రెండు విడతలుగా నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షను జూన్ 19న కేంద్ర విద్యాశాఖ రద్దుచేసింది.పరీక్షల నిర్వహణలో అత్యున్నత స్థాయి పారదర్శకత, పవిత్రతను కాపాడేందుకు యూజీసీ నెట్ జూన్ 2024 పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. వివరాలకు ఎన్‌సిఇటిఎట్‌దిరేట్‌ఆఫ్ ఎన్టీయే డాట్ ఎసి డాట్ ఇన్, సిఎస్ఐఆర్‌నెట్‌ఎట్‌దిరేట్ ఎన్టీయేడాట్ ఎసిడాట్‌ఇన్,ఎఐఎపిజిఇటిఎట్‌దిరేట్ ఎన్టీయే డాట్ ఎసి డాట్‌ఇన్ వెబ్ సైట్లను చూడాలని సూచించింది.

చైనా అందగత్తెలంతా గూఢచారులే!

అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ అనుమానం



బీజింగ్,నవంబరు 19: కృత్రిమ మేధ (ఏఐ) చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియామాజీ సీఈవో జెన్సన్ హువాంగ్ రాజీనామా వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనా గూఢచారిగా అనుమానిస్తున్న ఆలిస్ హువాంగ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్టు అంగీకరిస్తూ జెన్సన్ హువాంగ్ ఇటీవల తన పదవి నుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామంపై స్పందించిన ట్రంప్.. జెన్సన్‌ను అసాధారణ ప్రతిభావంతుడిగా అభివర్ణించారు. షెన్‌జెన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడారు. ఆలిస్ హువాంగ్ వల్ల అమెరికా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లిందా అన్న ప్రశ్నకు బదులిస్తూ ఆమె గూఢచారి అని తాను వినలేదన్నారు. అయితే చైనా నుంచి వచ్చే ఏ అందమైన మహిళనైనా అనుమానంతో గూఢచారిగానే జమకడతారని వ్యాఖ్యానించారు. ఆమె కేవలం చిప్‌లు కొనుగోలు చేసే వ్యాపారవేత్త మాత్రమేనని, వ్యాపారం చేసి లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతోనే అమెరికా ఎగుమతులకు అనుమతి ఇస్తోందని వివరించారు.

ఆయుష్ విభాగంలో 70 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

26 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,నవంబరు19,ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, వైద్య విద్యా సంస్థల్లో బోధనా సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆయుష్ విభాగంలో లెక్చరర్లు, టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుద్వారా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయుర్వేద, హోమియోపతి, యునానీ వైద్య విధానాలకు సంబంధించి మొత్తం 45 స్పెషాలిటీల్లో 70 పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఎంహెచ్ఎస్ఆర్‌బీ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 70 ఖాళీల్లో లెక్చరర్లు, టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులు ఉన్నాయి. హోమియోపతి విభాగంలో 11 స్పెషాలిటీల్లో, యునానీ విభాగంలో లెక్చరర్ పోస్టులతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు, ఆయుర్వేద విభాగంలో 14 లెక్చరర్ స్పెషాలిటీలతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నవంబర్ 26, 2026 నుంచి ఎంహెచ్ఎస్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు డిసెంబర్ 2, 2026 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. అభ్యర్థులు డిసెంబర్ 3వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి డిసెంబర్ 4వ త

భారత్ జట్టు విజయం

హాకీలో 3-2 తేడాతో న్యూజిలాండ్ ఓటమి



ఆక్లాండ్: ఆక్లాండ్‌లోని లాయిడ్ ఎల్స్‌మోర్ హాకీ స్టేడియంలో గురువారం జరిగిన హోరాహోరీ పోరులో అతిథ్య న్యూజిలాండ్‌పై 3-2 తేడాతో విజయం సాధించింది. దీంతో భారత పురుషుల హాకీ జట్టు తమ 2026 భారత్ న్యూజిలాండ్ శతాబ్ది క్రీడా ఐక్యతా కార్యక్రమ ప్రచారాన్ని ప్రారంభించింది. 25వ నిమిషంలో జోంటీ ఎల్వ్స్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో న్యూజిలాండ్ ఆధిక్యంలోకి వెళ్ళింది. దాదాపు వెంటనే భారత్ కూడా స్పందించింది, అదే 25వ నిమిషంలో ఉత్తమ్ సింగ్ ఫీల్డ్ గోల్ చేసి మ్యాచ్‌ను సమం చేశాడు. రెండవ అర్ధభాగంలో అతిథి జట్టు ముందుకు దూసుకెళ్లి, 38వ నిమిషంలో శరదానంద్ తివారీ చేసిన ఫీల్డ్ గోల్ ద్వారా ఆధిక్యంలోకి వెళ్ళింది. ఆ తర్వాత కెప్టెన్ సంజయ్ 43వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి స్కోరును 3-1కి చేర్చాడు. న్యూజిలాండ్ పట్టు వదలకుండా ప్రయత్నిస్తూ, 55వ నిమిషంలో సామ్ హిహా ఫీల్డ్ గోల్ చేయడంతో ఒక గోల్ వెనక్కి తగ్గింది. ఆఖరి దశల్లో భారత్ తన ఆధిక్యాన్ని కాపాడుకుని విజయం సాధించి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను సానుకూల రీతిలో ప్రారంభించింది. భారత్ శనివారం న్యూజిలాండ్‌తో మరోసారి తలపడనుంది. ఆదివారం మూడో మ్యాచ్ జరుగుతుంది.



పిఎస్ఎ కాపర్ ఈవెంట్‌లో

ఫైనల్‌కు వేలవన్

ఖతార్: దోహాలో జరిగిన క్యూఎస్ఎఫ్ 3 పిఎస్ఏ కాపర్ స్క్వాష్ టోర్నమెంట్‌లో, ఎనిమిదో సీడ్ అమీషెనాజ్ చందరన్‌పై నాలుగు గేమ్‌లలో విజయం సాధించి వేలవన్ సెంథిల్‌కుమార్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ ఏడాది రెండు కాపర్‌స్థాయి టైటిళ్లను గెలుచుకున్న రెండో సీడ్ సెంథిల్‌కుమార్, పురుషుల కోసం జరిగిన సెమీఫైనల్స్‌లో మలేషియాకు చెందిన ప్రపంచ 85వ ర్యాంకర్‌ను 11-8, 11-8, 12-14, 11-9 తేడాతో ఓడించాడు. అతను సర్క్యూట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు, చెక్ ఓపెన్, బుడాపెస్ట్ ఓపెన్‌లలో టైటిళ్లను గెలుచుకున్నాడు, ఇందులో పిఎస్ స్క్వాష్ టూర్‌లో అతను గెలుచుకున్న మొట్టమొదటి టైటిల్ కూడా ఇదే. ప్రపంచ 38వ ర్యాంకర్ అయిన అతను, చందరన్‌ను ఎదుర్కోవడానికి ముందు వరుసగా రెండు గేమ్‌లలో విజయాలు నమోదు చేశాడు. చందరన్ గట్టి పోటీ ఇచ్చి, ఖతార్‌లో వేలవన్‌కు మొదటి పెద్ద సవాలుగా నిలిచాడు. సెంథిల్‌కుమార్ ఇప్పుడు టైటిల్ కోసం స్విస్ ప్రపంచ నంబర్ 17 మరియు టాప్ సీడ్ అయిన డిమిత్రి స్టెయిన్‌మాన్‌తో తలపడనున్నాడు. పిఎస్ఎ సర్క్యూట్‌లో ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇదే తొలి పోరు. ఇక ఈ టోర్నమెంట్‌లో మరో భారత్ షట్లర్ అయాన్ వజీరల్లీ అంతకుముందు రౌండ్ ఆఫ్ 16లో దక్షిణాఫ్రికాకు చెందిన డెవాల్డ్ వాన్ నీకెర్క్ చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి చవిచూశాడు.

హాంకాంగ్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు

రక్షిత, సాత్విక్, చిరాగ్ జోడీ

కౌలూన్ (హాంకాంగ్): రక్షిత రామ్‌రాజ్ తన అద్భుతమైన పరుగును కొనసాగిస్తూ, గురువారం జరిగిన హాంగ్ కాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ 4 చెన్ యుఫెయిని ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. 19 ఏళ్ల ఈ భారత టీనేజ్ మాజీ ఒలింపిక్ ఛాంపియన్ మరియు ఐదుసార్లు ప్రపంచ పతక విజేతపై 45 నిమిషాల్లో వరుస గేమ్‌లలో 21-18, 24-22 విజయం సాధించింది. తొలి గేమ్‌ను గెలుచుకున్న తర్వాత రక్షిత రెండో గేమ్‌లో 5-15తో వెనుకబడినప్పటికీ పుంజుకుని, గేమ్‌ను 24-22తో ముగించి, థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్‌తో క్వార్టర్‌ఫైనల్ పోరుకు సిద్ధమైంది. అంతకుముందు ఆమె మొదటి రౌండ్‌లో డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ 20వ ర్యాంకర్ మియా బ్లిచ్‌ఫెల్డ్‌ను ఓడించి మరో సంచలనం సృష్టించింది. మరోపక్క ఇదే రోజు భారత పురుషుల డబుల్స్ జోడీ సత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి కూడా మలేషియాకు చెందిన నూర్ మహ్మద్ అజ్రిన్ అయూబ్-టాన్ వీ కియాంగ్‌లపై స్ట్రెయిట్ గేమ్‌లలో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 42 నిమిషాల్లో జరిగిన ఈ పోరులో నూర్ మరియు టాన్‌లపై 21-19, 21-16 తేడాతో గెలుపొందారు. జపాన్‌కు చెందిన కకేరు కుమగై మరియు హిరోకి నిషిలను 21-19, 21-17 తేడాతో ఓడించిన చైనాకు చెందిన హు కే యువాన్-లిన్ జియాంగ్ యిలతో సత్విక్-చిరాగ్ శుక్రవారం నాడు తదుపరి తలపడనున్నారు. ఇక మహిళల డబుల్స్‌లో, ప్రపంచ కాంస్య పతక విజేతలు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో అమెరికన్ జోడీ లారెన్ లామ్-అలిసన్ లీ చేతిలో 20-22, 13-21 తేడాతో ఓడిపోయి తమ ప్రయాణాన్ని ముగించారు. అలాగే లక్ష్య సేన్, పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన రాస్మస్ జెమ్కేపై 21-11, 21-18 తేడాతో విజయం సాధించాడు.









తొలిరోజు ముగిసిన టెస్ట్

న్యూజిలాండ్ స్కోర్ 243/5

వెల్లింగ్టన్ (న్యూజిలాండ్): వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్‌లో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజు ఆట ముగింపులో భారత్ బౌలింగ్‌లో మంచి ఆరంభం లభించింది. అయినప్పటికీ, హెన్రీ నికోల్స్ మరియు గ్లెన్ ఫిలిప్స్ ద్వారా న్యూజిలాండ్ బలంగా పుంజుకుని, 82 ఓవర్ల తర్వాత తొలి రోజు ఆటను 243/5 స్కోరుతో ముగించింది. భారత్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకుంది. జస్ప్రీత్ బుమ్రా, టామ్ లాథమ్‌ను డకౌట్ చేసి భారత జట్టుకు తొలి వికెట్ అందించాడు. ఆ తర్వాత అన్షుల్ కంబోజ్, డెవాన్ కాన్వేను 4 పరుగులకే ఔట్ చేయగా, ఆకాష్ దీప్, రచిన్ రవీంద్రను 15 పరుగులకే అవుట్ చేశాడు. బుమ్రా మరో రెండు వికెట్లు పడగొట్టాడు, డారిల్ మిచెల్‌ను 1 పరుగుకు, టామ్ బ్లుండెల్‌ను 5 పరుగులకు పెవిలియన్‌కు పంపాడు. భోజన విరామ సమయానికి న్యూజిలాండ్ 60/4కు పడిపోగా, ఆ తర్వాత 70/5కు కుప్పకూలింది, దీంతో భారత్ పటిష్టమైన స్థితిలో నిలిచింది. టామ్ బ్లుండెల్‌ను అవుట్టైన తర్వాత భారత్ మరో వికెట్ తీయలేకపోయింది. హెన్రీ నికోల్స్ మరియు గ్లెన్ ఫిలిప్స్ ఆరో వికెట్‌కు అజేయంగా 173 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి న్యూజిలాండ్‌ను తిరిగి మ్యాచ్‌లోకి తీసుకువచ్చారు. హెన్రీ నికోల్స్ 221 బంతుల్లో 113 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, ఫిలిప్స్ 182 బంతుల్లో 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వారి భాగస్వామ్యంతో న్యూజిలాండ్ ఆట ముగిసే సమయానికి 243/5 స్కోరును చేరుకుంది.

17 ఓవర్లలో 52 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన బుమ్రా భారత బౌలర్లలో అత్యుత్తమంగా నిలిచాడు. అన్షుల్ కంబోజ్ 57 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా, ఆకాష్ దీప్ 33 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు. ప్రసిద్ధ్ కృష్ణ 16 ఓవర్లలో 58 పరుగులు ఇచ్చి వికెట్లేమీ తీయలేకపోయాడు.న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయకుండా అడ్డుకోవడానికి, భారత్ ఇప్పుడు రెండో రోజు ఆరంభంలోనే వికెట్లు తీయాలని చూస్తుంది.

టీమిండియాకు బిగ్ షాక్..

బంగ్లాదేశ్‌పై గెలిచి లెక్కలు మార్చిన సౌతాఫ్రికా!

వాండరర్స్: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ప్రస్తుత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా పాయింట్ల పట్టికలో 75 పాయింట్ల శాతంతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు న్యూజిలాండ్ 72.22 పాయింట్ల శాతంతో అగ్రస్థానం నుండి రెండో స్థానానికి పడిపోయింది. ఈ క్రమంలో ఫైనల్ బెర్తుకు 68 పాయింట్లతో 4వ స్థానంలో ఉన్న టీమిండియా పరిస్థితి మరింత క్లిష్టతరమైంది. వాండరర్స్ వేదికగా గురువారం జరిగిన తొలి టెస్టులో చివరి రోజు దక్షిణాఫ్రికా విజయం సాధించింది. వర్షం కారణంగా అంతకుముందు రెండు రోజుల ఆటకు అంతరాయం ఏర్పడటంతో మ్యాచ్ ఫలితం వెలువడుతుందా, లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు అద్భుతంగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో 400 పరుగులు చేసిన బంగ్లాదేశ్, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తిగా తడబడింది. సైమన్ హార్మర్ స్పిన్ మాయా జాలంతో బంగ్లా బ్యాటర్లను పెవిలియన్‌కు పంపించాడు. అతడు రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా 6 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు కగిసో రబాడా 3 వికెట్లు తీసి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. దీంతో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 168 పరుగులకే ఆలౌటైంది. లిటన్ దాస్ 39 పరు గులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయంలో కగిసో రబాడా బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడమే కాకుండా బ్యాటింగ్‌లోనూ విలువైన పరుగులు సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో రబాడా 72 పరుగులు చేయగా, ఇక రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి మొత్తం 8 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు సైమన్ హార్మర్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసి బంగ్లాదేశ్‌ను దెబ్బకొట్టాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే కుప్పకూలడంతో దక్షిణాఫ్రికా ముందు కేవలం 12 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఓపెనర్ మార్క్‌స్ అకెర్మన్‌ను మెహిదీ హసన్ మిరాజ్ తొలి ఓవర్‌లోనే అవుట్ చేశాడు. రెండో ఓవర్‌లో ఎయిడెన్ మార్క్‌రమ్‌ను ఇబాదత్ హుస్సేన్ బౌల్డ్ చేసినప్పటికీ అది నోబాల్‌గా మారింది. దీంతో దక్షిణాఫ్రికా ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత మార్క్‌రమ్ జట్టును విజయతీరాలకు చేర్చాడు.





22రోజుల్లో 52 లక్షల పెళ్లిళ్లు

బిజినెస్ టర్నోవర్ రూ.7.5 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, నవంబరు 19: దేశంలో రాబోయే పెళ్లిళ్ల సీజన్ వ్యాపార రంగానికి కానుల వర్షం కురిపించనుంది. ఈనెల 21 నుంచి డిసెంబరు 15 మధ్య దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని, తద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల మేర వ్యాపారం జరిగే అవకాశం ఉందని అఖిల భారత వర్తకుల సమాఖ్య కెయిట్ అంచనా వేసింది. ఈ సీజన్ దేశీయ వినియోగానికి భారీ ఊతమివ్వడమే కాకుండా, సుమారు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, సీజనల్ ఉపాధి అవకాశాలను కల్పించనుందని తెలిపింది. దేశంలోని 25 రాష్ట్రాల్లో 300 మందికి పైగా వ్యాపార నాయకులు, 550 వాణిజ్య సంఘాలతో సంప్రదించిన అనంతరం కైట్ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఈ నివేదికను రూపొందించింది. మొత్తం రూ. 7.5 లక్షల కోట్ల వ్యాపారంలో వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల వాటా రూ.4.05 లక్షల కోట్లు (54 శాతం) కాగా, సేవల రంగం వాటా రూ.3.45 లక్షల కోట్లు అంటే 46 శాతంగా ఉండనుంది. వస్తువుల కొనుగోళ్లలో ఆభరణాలు, విలువైన లోహాలే అగ్రస్థానంలో నిలవనున్నాయి. వీటిపై రూ.1.2 లక్షల కోట్లు ఖర్చు చేయనుండగా, ఆ తర్వాత వస్త్రాలు, చీరలు, గార్మెంట్స్ విభాగంలో రూ. 90వేల కోట్ల వ్యాపారం జరగనుంది. ఇక సేవల విభాగంలో క్యాటరింగ్, ఆహార సేవల ద్వారా రూ. 75వేల కోట్లు, పెళ్లి వేదికలు, బాంకెట్ హాళ్లు, హోటళ్ల ద్వారా రూ. 60వేల కోట్ల ఆదాయం సమకూరనుంది.

ఒక్క ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలోనే సుమారు 5 లక్షల వివాహాలు జరగనుండగా, దీని ద్వారా రూ. 2.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని కైట్ వెల్లడించింది. ఈ పెళ్లిళ్ల సీజన్ వల్ల రిటైల్, తయారీ, ఆతిథ్యం, రవాణా, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాలకు భారీ మద్దతు లభిస్తుందని సమాఖ్య పేర్కొంది. డెకరేటర్లు, క్యాటరర్లు, ఫోటోగ్రాఫర్లు, రవాణాదారులు, ఇతర సేవా ప్రదాతలకు సుమారు 1.25 కోట్ల తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు లభిస్తాయని తెలిపింది. పెళ్లిళ్ల సీజన్ కేవలం సామాజిక, సాంస్కృతిక వేడుక మాత్రమే కాదని, లక్షలాది మంది వినియోగదారులు, వ్యాపారులు, ఎంఎస్ఎంఇలు, హస్తకళాకారులను ఏకంచేసే ఒక శక్తివంతమైన ఆర్థిక పరిణామమని కైట్ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ అభివర్ణించారు. ఈ సీజన్ ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రూ.40 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద



ముంబయి, నవంబరు 19: దలాల్‌స్ట్రీట్ గురువారం లాభాలతో బుల్ రంకెలు వేసింది. ఆటో, బ్యాంకింగ్, ఎఫ్ఎంసిజి, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలలో విస్తృతంగా కొనుగోళ్లు వెల్లువెత్తడంతో కీలక సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ క్రితం ముగింపుతో పోలిస్తే 989.94 పాయింట్లు ఎగబాకి 83,021.75 సుమారు 83,022 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 286.35 పాయింట్లు లాభపడి 25,514.30 సుమారు 25,514 వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ ఏకంగా 1,024 పాయింట్లు దూసుకెళ్లి చరిత్రలో తొలిసారిగా 63,000 మార్కును అధిగమించి 63,063 వద్ద సరికొత్త రికార్డు ముగింపును నమోదు చేసింది. దిగువ స్థాయిల వద్ద దేశీయ మరియు విదేశీ మదుపర్ల నుండి బలమైన కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు వేగంగా పుంజుకున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 645 పాయింట్లు పెరిగి 61,624 వద్దకు చేరగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.71 శాతం లాభపడింది. నిఫ్టీ 50 సూచీలోని 40కి పైగా షేర్లు లాభాల్లో ముగిశాయి. వాటిలో కొన్ని 7 శాతం వరకు ఎగబాకాయి. ఈ భారీ ర్యాలీ ఫలితంగా గురువారం ఒక్కరోజే ఇన్వెస్టర్లసంపద భారీగా పెరిగి, బిఎస్ఇలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 512 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరుకుంది. నవంబర్ నెలలో ఇప్పటివరకు బిఎస్ఇ మార్కెట్ క్యాప్ సుమారు రూ. 40 లక్షల కోట్లు పెరగడం మార్కెట్ జోరుకు అద్దం పడుతోంది. మొదటిది బ్యాంకింగ్ షేర్లలో విస్తృత కొనుగోళ్లు అని చెప్పవచ్చు. బ్యాంక్ నిఫ్టీ సూచీలోని అన్ని బ్యాంక్ స్టాక్స్ లాభాల్లో ముగియడం విశేషం. ముఖ్యంగా దిగ్గజ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగి ఇండెక్స్‌ను 63,000 పైకి తీసుకెళ్లాయి. కమోడిటీ ధరల తగ్గుదలతో ఆటో షేర్ల ర్యాలీ కనిపించింది. నిఫ్టీ ఆటో సూచీ 4 శాతానికి పైగా ఎగబాకగా, మహీంద్రా మహీంద్రా, ఐషర్ మోటార్స్, మారుతీ సుజుకీ షేర్లు 4 నుండి 7 శాతం వరకు దూసుకెళ్లాయి. ముడిచమురు, ఇతర ఇన్‌పుట్ ధరలు దిగిరావడం వల్ల సబ్బులు, ఆహార ఉత్పత్తులు, గృహోపకరణాలు తయారు చేసే ఎఫ్ఎంసిజి కంపెనీల లాభదాయకత మెరుగుపడి హిందుస్థాన్ యూనిలీవర్ షేరు 4శాతం మేర లాభపడింది. గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు డిసెంబరు నాటి సెటిల్‌మెంట్‌ధరలు బ్యారెల్‌కు 92.54 డాలర్లుగా ఉంది. ఎంసిఎక్స్‌లో డిసెంబరు నాలుగునాటి ధరలు పదిగ్రాముల పసిడి రూ.1,29,381కి చేరింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా 93.35గా నడిచింది. ఇక రాగి ధరల పతనంతో ఎసి కంపెనీలషేర్ల జోరు. విద్యుత్ ఉపకరణాలు, ఎయిర్ కండిషనర్ల తయారీలో కీలక ముడిసరుకైన రాగి ధరలు అంతర్జాతీయంగా భారీగా తగ్గడం ఎసి తయారీదారులకు పెద్ద ఊరటనిచ్చింది. దీంతో బ్లూ స్టార్, వోల్టాస్ మరియు పిజి ఎలక్ట్రోప్లాస్ట్ షేర్లు 9 శాతం వరకు ఎగబాకాయి. ఇంతటి బలమైన మార్కెట్‌లోనూ అమెరికా వడ్డీ రేట్ల ఆందోళనల కారణంగా నిఫ్టీ ఐటీ సూచీ మాత్రం 1.11 శాతం క్షీణించి ఒత్తిడిని ఎదుర్కొంది.

ఆంథ్రోపిక్ ఐపిఒతో కోటీశ్వరులైన ఉద్యోగులు



న్యూయార్క్,నవంబరు 19: కృత్రిమ మేధ సృష్టిస్తున్న సంపద సిలికాన్ వ్యాలీ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రికార్డులను తిరగరాస్తోంది. ప్రముఖ ఎఐ మోడల్ క్లాడ్ మాతృసంస్థ ఆంథ్రోపిక్ ఐపిఒ ద్వారా ఏకంగా 4,250 మంది ఉద్యోగులు రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా మారిపోయారు. కంపెనీలో పని చేస్తున్న సుమారు 70 శాతం మంది సిబ్బంది ఒక్క దెబ్బతో కోట్ల రూపాయల సంపదకు అధిపతులయ్యారు. నాస్‌డాక్‌లో లిస్టింగ్‌కుసిద్ధమైన ఈ సంస్థ ఒక్కో షేరు ధరను అంచనాలకు మించి 83 డాలర్లు (సుమారు రూ.7,745)గా నిర్ణయించింది. సంస్థలోమొత్తం 5,300మంది సిబ్బంది పనిచేస్తున్నారు. దాదాపు 80శాతంమంది, అంటే సుమారు 4,250 మంది ఉద్యోగుల వద్ద ఉన్న స్టాక్ ఆప్షన్ల విలువ ఈ ఐపిఒతో కనీసం 1 మిలియన్ డాలర్లు అంటే రూ.9.3 కోట్లు దాటింది. వీరిలో దాదాపు 1,200 మందికి పైగా ఉద్యోగుల సంపద 10 మిలియన్ డాలర్లు రూ.93 కోట్లు దాటింది. తొలినాళ్లలో చేరిన 50 మంది ఉద్యోగుల ఈక్విటీ విలువ 100 మిలియన్ డాలర్ల సుమారు రూ.930 కోట్లు మార్కును అధిగమించింది. సంస్థ ఏడుగురు సహ వ్యవస్థాపకులు తమ వాటాల నుంచి 3.38 మిలియన్ల చొప్పున షేర్లను విక్రయించారు. దీంతో ఒక్కొక్కరి ఖాతాలోకి దాదాపు రూ.2,600 కోట్లు అంటే 280 మిలియన్ డాలర్లు చొప్పున చేరాయి. ఏడుగురు వ్యవస్థాపకులకు కలిపి మొత్తం రూ.18,300 కోట్లకు 1.96 బిలియన్ డాలర్లకు పైగా సమకూరింది. మరోవైపు కంపెనీమొత్తం 980 మిలియన్ షేర్లను విక్రయించి ఏకంగా రూ.7.6 లక్షల కోట్లు 81.3 బిలియన్ డాలర్లు సమీకరించింది. గతంలో ఎలాన్‌మస్క్‌కు చెందినస్పేస్‌ఎక్స్ నమోదు చేసిన రూ.7.02 లక్షల కోట్ల 75 బిలియన్ డాలర్లు ఐపీవో రికార్డును ఆంథ్రోపిక్ తుడిచిపెట్టేసింది.

పిఎఫ్ కనీస నిల్వ 10%కి కుదించిన ఇపిఎఫ్ఒ



న్యూఢిల్లీ,నవంబరు 19: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఇపిఎఫ్ఒ పాక్షిక విత్‌డ్రా నిబంధనలు మార్చింది. ప్రస్తుతం ఉన్న 25 శాతం కనీస నిల్వ మొత్తాన్ని 10 శాతానికి తగ్గించింది. దీంతో రిటైర్మెంట్ కంటే ముందే 90 శాతం వరకు నిధులు విత్‌డ్రాచేసుకునే వెసులుబాటు కల్పించింది. కనీస నిల్వనూ విత్‌డ్రా చేసుకునేం దుకు ఉన్న 12 నెలల గడువును సైతం 2 నెలలకు తగ్గిస్తూ ఇపిఎఫ్ఒ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇపిఎఫ్ఒలో నెలవారీ జమయ్యే ఉద్యోగి, యజమాని వాటాల్లో 25 శాతం మొత్తాన్ని కనీస నిల్వగా ఇపిఎఫ్ఒ నిర్ణయించింది. ఈ కనీస మొత్తం మినహాయించగా మిగతా 75 శాతం నుంచి అనుమతించిన క్లెయిమ్‌ల సంఖ్య మేరకు నగదు ఉపసంహరణ చేసుకొనే వెసులుబాటును కల్పించింది. ఉద్యోగం మానేసిన వెంటనే నగదు నిల్వ నుంచి 75 శాతం వెనక్కి తీసుకోవచ్చు. తర్వాత 12 నెలలపాటు నిరుద్యోగిగా ఉంటే కనీస నిల్వ 25 శాతాన్ని కూడా తీసుకునేందుకు ఇపిఎఫ్ఒ ప్రస్తుతం అనుమతిస్తోంది. వైద్య, విద్య, వివాహం, ఇంటి నిర్మాణం వంటి, ఇతర అవసరాల కోసం ఇకపై 10 శాతం మినహా మిగిలిన మొత్తాన్ని విత్‌డ్రాచేసుకోవచ్చు. మిగిలిన 10 శాతం 55 యేళ్లు వచ్చాక విత్‌డ్రాచేసుకోవాలి. ఏదైనా కారణంతో 2 నెలల పాటు నిరుద్యోగిగా ఉన్నా ఆ పదిశాతం నిధులనూ ఉపసంహరించుకునే వెసులుబాటును ఇపిఎఫ్ఒ కల్పిస్తోంది. గతంలో 13 రకాలైన కేటగిరీలు, వేర్వేరు నిబంధనలు, పరిమితులు ఉండటంతో చందాదారుడి ఖాతాలోని నగదు సులువుగా తీసుకునేందుకు అవకాశం ఉండేది కాదు. తాజాగా ఈ కేటగిరీలను మూడు గ్రూపుల కింద విభజించడంతో ఎలాంటి పత్రాలు అవసరం లేకుండా నగదు తీసుకునేందుకు వెసులుబాటు లభిస్తోంది. గతంలో వివాహం, ఇంటి నిర్మాణం కోసం నగదు తీసుకునేందుకు కనీసం 57 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికే అవకాశం ఉండేది. కొత్త నిబంధనల కింద యేడాది సర్వీసు అనంతరం ఈ కేటగిరీల్లో నగదు తీసుకోవచ్చు.



రియాల్టీలో రీట్స్‌హావా

రెండో త్రైమాసికంలో యూనిట్ దారులకు రూ.3,234 కోట్ల పంపిణీ

ముంబయి,నవంబరు 19: భారతదేశంలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన ఆరురియల్‌ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు రీట్స్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో తమ యూనిట్‌దారులకు మొత్తం రూ.3,234 కోట్లను పంపిణీ చేశాయి. ఇండియన్ రీట్స్ అసోసియేషన్ విడుదల చేసిన డేటాహస్తే దేశవ్యాప్తంగా 5.25లక్షలమందికి పైగా పెట్టుబడి దారులు ఈ పంపిణీ ద్వారా ప్రయోజనం పొందారు. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఐదురీట్‌లు కలిపి రూ.2,331 కోట్లను పంపిణీచేయగా, ఈసారి ఆ మొత్తం దాదాపు 39 శాతం పెరిగింది. ప్రస్తుతం దేశంలో నమోదైన ఆరు రీట్‌లలో బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్స్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్‌రీట్స్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్, నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్, బాగ్‌మనే ప్రైమ్ ఆఫీస్ రీట్స్ ఉన్నాయి. 2026-27 రెండో త్రైమాసికం ముగిసేనాటికి ఈ రంగంలోని ఆరు రీట్స్ స్థూలఆస్తులనిర్వహణవిలువ రూ.3.30 లక్షల కోట్లను దాటింది. ఈ యేడాది 17, 2026 నాటికి వీటి మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.09 లక్షల కోట్లకు మించింది.ఈ ఆరు సంస్థలు దేశవ్యాప్తంగా 21.5 కోట్ల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో ఉన్న గ్రేడ్ ఏ కార్యాలయాలు, రిటైల్ ప్రాపర్టీలను నిర్వహిస్తున్నాయి. ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు తమ యూనిట్ దారులకు రూ.38వేల కోట్లకు పైగా పంపిణీ చేశాయి. నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్ సిఇఒ, ఇండియన్ రీట్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్ షిరీష్ గోడ్బోలే మాట్లాడుతూ, రెండో త్రైమాసికంలో రూ.3,234 కోట్ల పంపిణీ భారత రీట్స్ రంగం, దాని అంతర్లీన ఆస్తుల పటిష్టతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జిసిసిలు), ఫ్రంట్ ఆఫీస్ సంస్థలనుంచి కార్యాలయస్థలాలకు పెరుగుతున్న డిమాండ్ ఈ రంగానికి మద్దతుగా నిలుస్తోందని ఆయన తెలిపారు. కార్యాలయాల్లో ఆరోగ్యకరమైన ఆక్యుపెన్సీ స్థాయిలు, సమర్థవంతమైన అద్దెవసూళ్లు పెట్టుబడిదారులకు పంపిణీలు కొనస